



భుజబలపట్నంలో అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సర్వే కమిటీ సభ్యులు

## స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ సర్వే

కైకలూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి):గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎస్.సందీప్ అన్నారు. కైకలూరు, భుజబలపట్నం గ్రామాల్లో శనివారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2025 కేంద్ర కమిటీ బృందం పర్యటించింది. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, సబ్ సెంటర్లు, చెత్తసంపద తయారీ కేంద్రాలను, కైకలూరు ఎస్టీ కాలనీలోని పలు గృహాలను సందర్శించారు. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ఆలయాలు, చర్చిల్లోను మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలని, చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కమిటీ సభ్యులు, సూపర్‌వైజర్ పి.సత్తిబాబు, కె.శ్రీనివాసు, శివకుమారి, పంచాయతీ కార్యదర్శులు ప్రసాద్, రవికిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

## సరిపడా ఎరువులు సిద్ధం: కలెక్టర్

ఏలూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి):జిల్లాలో రైతాంగానికి సరిపడా ఎరువుల నిల్వలు సిద్ధంగా ఉంచామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్‌కు వివరించారు. శనివారం ఆయన కలెక్టర్లు, వ్యవసాయాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎరువుల నిల్వలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వెట్రిసెల్వి మాట్లాడుతూ ఎక్కడా అధిక ధరలకు విక్రయించకుండా, బ్లాక్ మార్కెట్ తరలించకుండా తనిఖీలు చేపట్టామన్నారు. వీసీలో జిల్లా వ్యవసాయశాఖ జేడీ హబీబ్ బాషా పాల్గొన్నారు.

## కల్లు కల్తీ చేస్తే చర్యలు తప్పవు..

ఏలూరు,జూలై 12(ఆంధ్రజ్యోతి): సహజమైన కల్లును కల్తీ చేసి ప్రజల ప్రాణాలను తీస్తే సహించేది లేదని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రొహిబిషన కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఏలూరు, నూజివీడు, పోలవరం, చింతలపూడి తదితర ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో సీఐలు స్థానిక లైసెన్సుదారులతో సమావేశం నిర్వహించి శనివారం అప్రమత్తం చేశారన్నారు. ఏలూరు సీఐ ధనరాజ్ ఆధ్వర్యంలో జరిగిన సమీక్షలో స్థానిక మద్యం, కల్లు షాపుల యజమానులు పాల్గొన్నారు.



ఏలూరులో..

# ఎన్నాళ్లీ కష్టాలు!



పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి పరవళ్లు

## ఏటా మూటాముల్లె సర్దుకోవాల్సిందే..

- పునరావాసం పూర్తయితే ఈ కష్టాలు తీరేవి
- సొంతూరు వీడలేక గుట్టలమీదే ఆవాసాలు.. అధికారుల ఒత్తిడితో కొన్నాళ్లు సర్దుబాటు
- ముంపు మండలాల్లో వానాకాలం కష్టాలు అన్నీఇన్నీకావు

ఏటా వర్షాకాలం వచ్చిందంటే చాలు మూడు నెలలుపాటు మూటాముల్లె సర్దుకోవాల్సిందే. కొండలు, గుట్టలమీద పాకలు వేసుకుని కాలక్షేపం చేయాల్సిందే. ఇదంతా ముంపు మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గిరిజనులు, గిరిజనేతరులు ఎదుర్కొంటున్న సమస్య. గోదావరి వరద వీరందరికి కొత్తేమి కాదు. భద్రా చలం వద్ద గోదావరి ఉరకలను బట్టి ఇక్కడ ముందస్తు జాగ్రత్తలకు దిగుతారు. అంతే తప్ప ఊరుదాటి వెళ్లేందుకు ఇష్టపడరు. ఇంకా ఎన్నాళ్లు తమకు ఈ కష్టాలు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఆరంభమైన తర్వాత, ఎగువ కాఫర్ డ్యామ్ నిర్మాణం జరిగిన తర్వాత సీనే మారిపోయింది. ఎగువ నుంచి వస్తున్న వరద పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి దిగువకు మళ్లాల్సిఉంది. ఈ నేపథ్యంలోనే గత నాలుగేళ్లగా భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ కావడానికి ముందుగానే ముంపు మండలాల్లో సురక్షిత ప్రాంతాలకు ప్రజలు తరలింపు ఆరంభమవుతోంది. అధికారులు పెద్దసంఖ్యలో మకాం వేసి పునరావాస కాలనీలకు నిర్వాసితులను ముందస్తుగా తరలిస్తూ ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్త పడుతున్నారు. ఎద్దువాగు, గుండేటివాగులోకి గోదావరి వరద చేరుతుండటంతో రాకపోకలు స్థంభిస్తున్నాయి. దాదాపు పాతిక గ్రామాలకు పైగానే ఇబ్బందులకు గురవుతున్నాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు గ్రామస్తులను పదేపదే ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు చేరాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు. అయినా కొందరు ఈ వరద అంతా తమకు కొత్తేమి కాదనే ధీమాతో ఉన్నారు. గొమ్ముగూడెం ఇతర ప్రాంతాలకు చెందిన వారు సమీపాన ఉన్న గుట్టలపై తాత్కాలికంగా నివాసం కోసం పాకలు ఏర్పాటు చేసుకున్నారు. రెండేళ్ల క్రితం గోదావరికి భారీ వరదలు వచ్చినప్పుడు రుద్రంకోట నుంచి ఇతర గ్రామాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలోనే రోజుల తరబడి కొండలపైనే కాలక్షేపం చేశారు. ఇంకోవైపు పునరావాసం (మిగతా 8వ పేజీలో)



కుక్కునూరు మండలం దాచారంలో స్థానికులకు ఆహారం అందించేందుకు ఏర్పాట్లు



గత ఏడాది వరదలకు పూర్తిగా దెబ్బతిన్న పెద్దవాగు ప్రాజెక్టు



కుక్కునూరు, దాచారం గ్రామాల మధ్య నీటమునిగిన రోడ్డు



వేలేరుపాడు మండలంలో కొండ మీద తాత్కాలిక నివాసాలకు ఏర్పాట్లు

## పెరుగుతూ.. శాంతిస్తూ

- గోదావరి వరద దోబూచులాట
- దాచారం పునరావాస కాలనీకి తరలివెళ్లిన 170 కుటుంబాలు
- ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

కుక్కునూరు/ వేలేరుపాడు/పోలవరం : గోదావరి నీటిమట్టం నెమ్మదిగా పెరిగి నెమ్మదిగా తగ్గుతోంది. శుక్రవారం రాత్రి 11 గంటలకు భద్రాచలం వద్ద 38.80 అడుగుల నీటిమట్టం ఉండగా శనివారం ఉదయం 6గంటలకు 40.40 అడుగులకు చేరుకుంది. అనంతరం నెమ్మదిగా పెరుగుతూ సాయంత్రం 4గంటలకు 41.30 అడుగులకు చేరింది. అనంతరం నిలకడగా ఉండి సాయత్రం 6గంటలకు 41.20 అడుగులకు తగ్గింది. గోదావరి ప్రభావంతో కుక్కునూరు, దాచారం గ్రామాల మధ్య గుండేటివాగు నీటమునగగా



పునరావాస కాలనీకి తరలివెళ్తున్న గొమ్ముగూడెం వాసులు

ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిని కూడా వరదనీరు ముంచెత్తింది. కుక్కునూరు నుంచి వేలేరుపాడు వెళ్లే ప్రజలంతా వయా నల్లకుంట మీదుగా తిరిగి వెళ్తున్నారు. గొమ్ముగూడెం నుంచి 170 కుటుంబాలు దాచారం పునరావాస కాలనీకి తరలివెళ్లాయి. జడ్పీ సీఈవో శ్రీహరి, జంగారెడ్డిగూడెం ఆర్డీవో రమణ, ఐటీడీపీవో రాములనాయక్, దాచారం పునరావాసకాలనీలో నిర్వాసితులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆహార ఏర్పాట్లు చేస్తున్నారు. నిర్వాసితులకు తాగునీటి సౌకర్యం కోసం కొత్తగా మూడుబోర్లు ఏర్పాటు చేశారు. లచ్చిగూడెం గ్రామస్థులను అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

### ఆర్అండ్ఆర్ కాలనీలకు తరలివెళ్లండి..

రానున్న ఈ మూడు నెలల పాటు వరదల కాలం కాబట్టి ముంపు గ్రామాల ప్రజలు ఆర్అండ్ఆర్ కాలనీలకు తరలివెళ్లాలని జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ.రమణ, పీడీ డీఆర్‌డీఏ విజయరాజు ప్రజలను కోరారు. తాడువాయిలోని ఆర్అండ్ఆర్ కాలనీల్లో అన్ని సౌకర్యాలు కల్పించినట్టు తెలిపారు. వేలేరుపాడు మండలం రేపాకగొమ్ములో శనివారం అధికారులు పర్యటించి గ్రామాన్ని (మిగతా 8వ పేజీలో)

### అప్రమత్తంగా ఉండండి : కలెక్టర్

ఏలూరు,జూలై 12(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గోదావరి వరదలు తగ్గే వరకు అధికార యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ముంపు పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకుంటున్నారు. వరదల కారణంగా ఒక్కరికి ప్రాణ,ఆస్తి నష్టాలు వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వరదనీరు ఉధృతంగా ప్రవహించే కల్వర్టులు, కాజ్‌వేలు, రహదారులను ముందస్తుగానే మూసి ఉంచడంతో పాటు ప్రజలు ప్రయాణించకుండా ఆ ప్రాంతాల్లో సిబ్బందిని నియమించాలన్నారు.

# రీసర్వే తప్పులు.. పథకాలకు దూరం

- గత వైసీపీ సర్కారు తప్పిదం.. పేదలకు శాపం

ఏలూరు రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన రీసర్వే రైతులకు శాపంగా మారింది. మరికొంత మందికి సంక్షేమ పథకాలు అందడం లేదు. గతంలో పాస్‌పుస్తకాలు చూడకుండా రీసర్వే చేపట్టారు. తప్పుల తడకగా రికార్డులు నమోదు చేశారు. భూమి ఉన్నవారికి లేనట్టు, లేని వారికి ఉన్నట్టు మరికొందరికి అధికంగా భూములు ఉన్నట్టు చూపారు. వాటిని సరిచేసేందుకు టీడీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ప్రస్తుతం ఎంతోమంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### వేధిస్తున్న సాంకేతిక సమస్యలు

గత వైసీపీ ప్రభుత్వం పూర్వ సర్వే సంఖ్యల స్థానంలో ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్) సంఖ్య వ్యవస్థ తీసుకొచ్చింది. దీనితో వెబ్‌ల్యాండ్‌లో పలు సాంకేతిక సమస్యలు తలెత్తాయి. గతంలో ఒక భూమికి సంబంధించి ఒకే సర్వే సంఖ్య ఉండేది. దానికి చుట్టుపక్కల ఉన్న భూములకు అదే సర్వే సంఖ్యలను సబ్ డివిజన్ చేసి కేటాయించారు. గత ప్రభుత్వం హయాంలో చేపట్టిన భూముల సర్వే సమయంలో ఐదారుగురు రైతులకు కలిసి ఒకే సంయుక్త ఎల్‌పీఎం సంఖ్యను కేటాయించి భూ హక్కు పత్రాలను అందజేశారు. దీంతో రుణాలకే కాదు సంక్షేమ పథకాలు మంజూరుకు సాంకేతికపరమైన సమస్యలు వెంటాడుతున్నాయి.

### కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ

ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం 'తల్లికి వందనం' పథకం అమలుకు ఆరు అంచెల విధానం అమలవుతోంది. మూడెకరాలకు మించి మాగాణి, 10 ఎకరాలను మించి మెట్టభూమి రెండూ కలిసి 10 ఎకరాలకు మించి ఉండకూడదు. అర్హులై ఉండి కూడా గత ప్రభుత్వం చేసిన తప్పిదాలతో అర్హుల జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంయుక్త ఎల్‌పీఎం సంఖ్య సమస్య తెలుసుకున్న రైతులు తమ ఖాతా ను విడదీసి ఒక్కొక్కరికి ఒక్కో సంఖ్య ఇవ్వాలని తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉదాహరణకు ఏలూరు రూరల్ మండలంలో అండగళ్, డబుల్ ఎల్‌పీఎం నెంబర్ల కేటాయింపులపై 150 పైగా ఫిర్యాదులు వచ్చాయి. వీటిని గ్రామసభ ద్వారా పరిష్కరించాల్సి ఉంది.

# ఫ్రీ బస్‌కు..రైట్ రైట్



(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

- ఆగస్టు 15న నుంచి మహిళల ఉచిత బస్సుకు ప్రభుత్వం ముహూర్తం
- బస్సులన్నింటిని సిద్ధం చేయాలని ఆదేశాలు
- ఫిట్టింగులకు స్పెషల్ టీమ్‌లతో పనులు
- ఈనెల మూడోవారంలోనే విధివిధానాలు ఖరారు
- పల్లెవెలుగుకే పరిమితమా?

ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల్లో భాగంగా మరొకటి గాడిన పెట్టేందుకు టీడీపీ ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. మహిళలు ఎప్పుడెప్పుడా అని సంబరపడుతున్న ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి ఆగస్టు 15న ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. మహిళలు ఉచిత ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకోవాలని ఇప్పటికే జిల్లా ప్రజా రవాణాశాఖాధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు అధికారులు అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నం అయ్యారు. జిల్లాలో పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సులు 113, ఎక్స్‌ప్రెస్‌లు 14 కలిపి మొత్తం 127 బస్సులను ఆర్టీసీ కలిగి ఉంది. ఇవే కాకుండా ప్రైవేట్ సెక్టార్‌లోని హైయ్యర్ బస్సులు పల్లెవెలుగు 50, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల కింద 17 కలిపి మొత్తం మరో 67 బస్సులు వివిధ రూట్లలో ప్రజలకు సేవలందిస్తున్నాయి. కాగా ఆర్టీసీ, ప్రైవేట్ హైయ్యర్ పల్లెవెలుగు బస్సులు మొత్తం 163 సర్వీసులకు ఉచిత బస్సు ప్రయాణం పరిమితం చేసే అవకాశాలు లేకపోలేదు. అదేవిధంగా ఉమ్మడి పశ్చిమకు జిల్లాకు వర్తింప చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రతీరోజు జిల్లాలో బస్సులన్నీ కలిపి మొత్తం మీద లక్షా 12వేల కిలోమీటర్లు తిరుగుతున్నాయి. ఆక్యుపెన్సీ రేషియా రద్దీ కాలంలో 74 శాతం ఉంటుండగా, ఆషాఢం కావడంతో ప్రయాణాల పెద్దగా లేకపోవడంతో ఆక్యుపెన్సీ రేషియా 65 శాతానికి తగ్గింది. మహిళల ఉచిత బస్సు ప్రయాణంపై ఈనెల 25లోగా విధి విధానాలు ఖరారయ్యే అవకాశాలున్నట్లు చెబుతున్నారు.

### ప్రయాణికుల రాకపోకలపై ఆరా..

ఇదిలా ఉండగా ఎంతమంది సగటున మహిళలు వివిధ రూట్లలో ప్రయాణిస్తున్నారు. ఏయే ప్రాంతాల్లో మహిళా ప్రయాణికులతో రద్దీ ఉంటోంది. జిల్లా వ్యాప్తంగా ఎంతమంది మహిళలు వివిధ అవసరాల నిమిత్తం రాకపోకలు సాగిస్తున్నారో సీఐ,సీటీవోలులు ఇప్పటికే రంగంలో దిగి ఆరా తీస్తున్నారు. వివిధ రూట్లలో కంట్రోలర్లు, ఇతర ఉద్యోగుల నుంచి ఆరా తీస్తున్నారు.రోజుకు 50 వేల మందికి పైబడి ప్రయాణాలు చేసే వారు ఉండ వచ్చని అంచనా వేస్తున్నారు.

### ఫిట్టింగ్‌లపై ప్రత్యేక శ్రద్ధ

ప్రధానంగా ఆర్టీసీ బస్సులను ఉచిత ప్రయాణానికి సిద్ధం



ఏలూరు ఆర్టీసీ డిపోలో బస్సులకు మరమ్మతులు

చేయాలని ఆదేశాలు అందడంతో అధికారులు బస్సులపై శ్రద్ధ పెట్టారు. ప్రత్యేక టీమ్‌లతో ఉన్న బస్సులనే మరింత ఫిట్‌గా సిద్ధం చేస్తున్నారు. అవసరమైన సామగ్రిని విజయవాడ జోనల్ వర్క్‌షాపు, ఇతర చోట్ల నుంచి స్పేర్‌పార్టులను ఏలూరు డిపోకు ఇప్పటికే తరలించారు. ఏలూరు గ్యారేజీలో బస్సులకు అవసరమైన మార్పులు, చేర్పులను చేస్తున్నారు.

### ఏర్పాట్లు చేస్తున్నాం : డీపీటీవో, షేక్ షబ్నం



జిల్లాలో ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి బస్సులన్నింటిని సిద్ధం చేసుకుని ఉంచుకోవాలని ఉన్నతాధికా రుల నుంచి ఆదేశాలు వచ్చాయి. అయితే జిల్లాకే పరిమి తమా? రాష్ట్రం మొత్తం అనుమతిస్తారన్న దానిపై విధి విధానా లు రావాల్సి ఉంది. ఎప్పుడు నడపాలని ఆదేశించిన సర్వం సిద్ధంగా ఉన్నాం.

# ముంచిన మామిడి!

- మామిడి రైతులకు నష్టాలు
- అయిన కాడికి అమ్ముకున్నారు..
- అమలుకు నోచుకోని మామిడి మార్కెట్ ఏర్పాటు హామీ

నూజివీడు, జూలై12(ఆంధ్రజ్యోతి): నూజివీడు, చింతలపూడి, మైలవరం, తిరువూరు నియోజకవర్గాలలోని మామిడి రైతులు ఈ ఏడాది భారీ నష్టాన్ని చవిచూశారు. ఈ ప్రాంతంలో మామిడి సీజన్ జూన్‌లోనే ముగుస్తుంది. చిత్తూరులో మామిడి పంట జూలై నెలాఖరు వరకు ఉంటుంది. ప్రభుత్వం ఆ ప్రాంతంలోని తోతాపురి మామిడికి కేజీకి రూ.4 ప్రోత్సాహకం ఇవ్వడమే కాక కేంద్ర సాయం కోరింది. ఇక్కడ మామిడి రైతుల పరిస్థితిని పట్టించుకునే వారు లేరు. మామిడి రైతులు, వ్యాపారులు అయినకాడికి పంట అమ్ముకున్నారు.

### మామిడి మార్కెట్.. అతీగతీ లేదు

గతేడాది జూన్ 4న మామిడి రైతుల సమావేశంలో 2025 మామిడి సీజన్‌కు నూజివీడు మార్కెట్ యార్డులో మామిడి మార్కెట్‌ను ఏర్పాటు చేస్తామని మంత్రి పార్థసారథి రైతులకు హామీ ఇచ్చారు. అనుమతుల కోసం ఆర్థికశాఖ వద్ద ఆఫైలు పెండింగ్‌లో ఉంది. ఏడాది గడిచి మామిడి సీజన్ ముగిసినా అతీ గతీ లేదు.

### మూతపడిన గుజ్జు కర్మాగారాలు

నూజివీడు ప్రాంతంలో పదేళ్ల క్రితమే మామిడి గుజ్జు కర్మాగారాలు మూతపడ్డాయి. వాటిని తెరిపించి ఉంటే రైతులకు కొంతమేలు జరిగేది. మామిడి పరిశోధన కేంద్రం ఉన్నప్పటికీ రైతులకు సస్య రక్షణ, మామిడి ఎగుమతులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పేవారు లేరు. ఈప్రాంతంలో మామిడి ఉప ఉత్పత్తుల కర్మాగారాలు ఏర్పాటు చేస్తామని పదేళ్ల నుంచి రాజకీయ నేతలు ఇచ్చిన హామీలు కార్యరూపం దాల్చలేదు.

### రైతులకు మేలు జరగాలంటే..

ఈ ప్రాంత మామిడి రైతులకు మేలు జరగాలంటే మామిడి పరిశోధన కేంద్రం పూర్తి స్థాయిలో పని చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. గుజ్జు కర్మాగారాలు తెరిపించి స్థానికంగా మామిడి మార్కెట్‌ను ఏర్పాటు చేయాలి. మామిడి జ్యూస్, పౌడర్, మామిడి తాండ్ర వంటి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయించాలి. గత పదేళ్లగా నష్టాలు చవిచూస్తున్న మామిడి రైతులు తోటలను నరికివేసి ఆ చెట్లను కలపకు అమ్ముకొని ప్రత్యామ్నాయ పంటల వైపు మరలచడానికి సిద్ధపడుతున్నారు.



ప్రైవేటు మార్కెట్లో విక్రయించేందుకు తెచ్చిన మామిడికాయలు

## అజాగ్రత్తగా పట్టుకుంటే షాక్

రోజురోజుకు పెరుగుతున్న విద్యుత్ ప్రమాదాలు

వర్షాకాలంలో మరింత అప్రమత్తత అవసరం

లోపలి పేజీలో..

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

# పవర్‌ఫుల్ పాత్రలో



రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా 'పెద్ది'. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థల సమర్పణలో వృద్ధి సినిమాస్ బేనర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ఫస్ట్ షాట్ గ్లింప్స్‌తో దేశవ్యాప్తంగా అంచనాలను పెంచేసింది. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్‌కుమార్ ఈ చిత్రంలో 'గౌర్నాయుడు' అనే పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో కనిపించబోతున్నారు. శనివారం అయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా శివరాజ్‌కుమార్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. కాగా, ఈ సినిమాలో రామ్‌చరణ్ సరసన కథానాయికగా జాన్వీకపూర్ నటిస్తున్నారు. జగపతి బాబు, దివ్యేంద్రు శర్మ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 27న రామ్‌చరణ్ పుట్టిన రోజు సందర్భంగా సినిమా విడుదల కానుంది.

## కథ విని ఉద్వేగానికి లోనయ్యా

- సెంథిల్ కుమార్



'ఒక సినిమా అంగీకరించే ముందు కథలో ప్రేక్షకులను కదిలించే బలమైన భావోద్వేగాలు ఉన్నాయా, లేవా? అని చూస్తాను. 'జూనియర్' సినిమా స్క్రిప్ట్ నాకు బాగా నచ్చింది. కథ విని ఉద్వేగానికి లోనయ్యా. బలమైన భావోద్వేగాలతో పాటు ప్రేమ, కుటుంబ విలువలతో సినిమా ఆద్యంతం హృద్యంగా ఉంటుంది' అని సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్ అన్నారు. గాలి జనార్ధన్‌రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా నటించిన చిత్రమిది. రాధాకృష్ణ దర్శకత్వంలో రజనీ కొర్రపాటి నిర్మించారు. ఈ నెల 18న 'జూనియర్' విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందించిన సెంథిల్ కుమార్ మీడియాతో మాట్లాడారు. 'దర్శకుడు రాధాకృష్ణ చెప్పిన కథ నాకు బాగా నచ్చింది. కొత్త హీరోకు ఇలాంటి సినిమా చేయడం కొంచెం కష్టమే. కానీ కిరీటి ఒక సవాల్‌గా తీసుకొని ఈ సినిమా కోసం కష్టపడిన తీరు నాకు నచ్చింది. ఈ సినిమాలో పాటలతో పాటు కిరీటీ, శ్రీలీల జంట చేసిన డాన్స్‌లను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు. కిరీటి మంచి నటుడు, అద్భుతమైన డాన్సర్. సెట్స్‌లో చాలా కష్టపడ్డాడు. తొలి చిత్రం 'జూనియర్'తోనే ఆయన ప్రేక్షకులను ఆకట్టుకుంటాడనే గట్టి నమ్మకం ఉంది. ఒక మంచి సినిమా అందించాలనే తపనతో నిర్మాతలు ఈ సినిమా తీశారు' అని చెప్పారు.

## బ్యూటిఫుల్ మెలోడీ



రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. 'చి ల సౌ'తో జాతీయ అవార్డు అందుకున్న రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. గీతా ఆర్ట్స్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచేసింది. ఈ నెల 16న సినిమా నుంచి 'నదివే' అంటూ సాగే పాటను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఈ బ్యూటిఫుల్ మెలోడీకి హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందించారు. త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కృష్ణన్ వసంత్.

## యాక్టర్స్‌ని తిట్టాను.. కొట్టాను..

ప్రవీణ పరుచూరి



'మా 'కొత్తపల్లిలో ఒకప్పుడు' సినిమాలో రెండు పాత్రల మధ్య నడిచే సన్నివేశాలు కీలకంగా నిలుస్తాయి. వారి మధ్య వచ్చే సన్నివేశాలు అద్భుతంగా రాకపోతే సినిమా సాదాసీదాగా ఉంటుంది. అందుకే వారి నుంచి మంచి నటన రాబట్టాలనుకున్నాను. సెట్‌లో వారిని తిట్టాను, కొట్టాను, వారిపై రాళ్లు విసిరాను. మనం చేసే పాత్రలో జీవించడమే నటన అని నమ్ముతాను. అందుకే సినిమా కోసం ఏదైనా సరే తప్పదు. అందుకే వారిపట్ల అలా ప్రవర్తించినందుకు క్షమాపణలు చెప్పలేదు' అని దర్శకురాలు ప్రవీణ పరుచూరి చెప్పారు. రానా సమర్పణలో మనోజ్ చంద్ర, మోనికా జంటగా ప్రవీణ తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మనోజ్ చంద్ర మాట్లాడుతూ 'ప్రవీణ చేసే సినిమాల్లో నటిస్తే సరిపోదు, పాత్రల్లో జీవించాలి. అలా రామకృష్ణ పాత్రకు నేను ప్రాణం పోశానని నమ్ముతున్నాను' అని చెప్పారు.

## స్నేహితులే రాజకీయ ప్రత్యర్థులు



ఆది పినిశెట్టి, చైతన్య రావు ప్రధాన పాత్రల్లో 'ప్రస్థానం' ఫేమ్ దేవా కట్టా, జయకిరణ్‌కుమార్ సంయుక్తంగా తెరకెక్కించిన వెబ్ సిరీస్ 'మయసభ'. 'రైజ్ ఆఫ్ ద టైటాన్స్' ట్యాగ్‌లైన్. విజయ్‌కృష్ణ లింగమనేని, శ్రీహర్ష నిర్మించారు. ఆగస్టు 7న ఓటీటీ వేదిక సోనీ లైవ్ ద్వారా అందుబాటులోకి రానుంది. తాజాగా, టీజర్‌ను విడుదల చేశారు. సంభాషణలు, ప్రధాన పాత్రధారుల మధ్య ఉన్న సంఘర్షణ, భావోద్వేగాలు ఆకట్టుకున్నాయి. ఇద్దరు స్నేహితులు కొన్ని పరిస్థితుల వల్ల రాజకీయ ప్రత్యర్థులుగా మారితే ఎలా ఉంటుందనేది కథాంశం. అయితే వీరిద్దరి పాత్రలు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, మాజీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖర్ రెడ్డిని పోలి ఉంటాయని సమాచారం.

## చెన్నైలో తెలుగు అబ్బాయి కథ



సంతోష్ శోభన్ హీరోగా నటిస్తోన్న చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ తెలుగు, తమిళ భాషల్లో నిర్మిస్తోంది. మ్యూజికల్ రొమాంటిక్ లవ్‌స్టోరీగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. శనివారం సంతోష్ శోభన్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెబుతూ చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ని రిలీజ్ చేసింది. పోస్టర్‌లో చెన్నైలో జీవనం కొనసాగిస్తున్న మధ్యతరగతి తెలుగు అబ్బాయిగా సంతోష్ శోభన్ కనిపిస్తున్నారు. చెన్నై నగరం బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ ప్రేమ కథా చిత్రం ప్రేక్షకులకు మంచి అనుభూతిని కలిగిస్తుందని చిత్రబృందం పేర్కొంది.

# 'సెమిస్టర్'కు కనీస హాజరు ఉండాల్సిందే!

- పరీక్షలకు సంబంధించిన నిబంధన సరైందే
- బీటెక్‌పై హైకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ



అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): బీటెక్ విద్యార్థులు సెమిస్టర్ పరీక్షలకు హాజరయ్యేందుకు కనీస హాజరుశాతం తప్పనిసరని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. దీనికి సంబంధించి జేఎన్‌టీయూ కాకినాడ, జీఎంఆర్‌ఐటీ రూపొందించిన నిబంధనలను సమర్థించింది. కనీస హాజరు నిబంధన సహేతుకం కాదని, ఏకపక్షం అంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు చట్టం ముందు నిలబడవని పేర్కొంది. సింగిల్ జడ్జి తీర్పులోని ఈ భాగాన్ని రద్దు చేసింది. అయితే, ప్రస్తుత కేసులో కోర్టు ఆదేశాల మేరకు విద్యార్థి కౌశిక్ తన 4, 5వ సెమిస్టర్‌ను కొనసాగించారని గుర్తు చేసింది. కౌశిక్ 4, 5 సెమిస్టర్లను రద్దు చేసి, తిరిగి ఆయనను 3వ సెమిస్టర్‌కు పంపించడం సముచితం కాదని అభిప్రాయపడింది. ఇలా చేయడం వల్ల కౌశిక్ అకడమిక్ ప్రయోజనాలు దెబ్బతింటాయని పేర్కొంది. జీఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ అకడమిక్ రెగ్యులేషన్ 9(ఐ)(జే) ప్రకారం మేకప్ క్లాస్‌లకు హాజరుకావడం ద్వారా తగిన హాజరుశాతం సాధిస్తే పరీక్ష రాసేందుకు అర్హత సాధించవచ్చని గుర్తు చేసింది. హాజరులోపాన్ని సరిదిద్దుకునేందుకు వీలుగా మేకప్ క్లాస్‌లకు హాజరయ్యేందుకు కౌశిక్‌ను అనుమతించింది. ఈ తీర్పుని ప్రత్యేక పరిస్థితుల్లో ఇస్తున్నామని, భవిష్యత్తులో ఈ ఉత్తర్వులను ప్రామాణికంగా తీసుకోవడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. శ్రీకాకుళం జిల్లాలోని జీఎంఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్‌లో బీటెక్(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) అభ్యసిస్తున్న బీవీకే కౌశిక్ అనారోగ్యం కారణంగా తరగతులకు హాజరుకాలేకపోయాడు. హాజరుశాతం 65% కన్నా తక్కువగా ఉందనే కారణంతో కళాశాల యాజమాన్యం ఆయనను మూడవ సెమిస్టర్ పరీక్షలకు అనుమతించలేదు. దీంతో కౌశిక్ హైకోర్టును ఆశ్రయించగా, పరీక్షలు రాసేందుకు అనుమతించిన కళాశాల యాజమాన్యం, ఫలితాలు మాత్రం వెల్లడించలేదు. దీంతో మూడవ సెమిస్టర్ ఫలితాలు వెల్లడించడంతో పాటు నాలుగవ సెమిస్టర్ క్లాసులకు హాజరయ్యేందుకు అనుమతించేలా కళాశాల యాజమాన్యాన్ని ఆదేశించాలని కోరుతూ కౌశిక్ మరో పిటిషన్ దాఖలు చేశారు.

## ఉపాధి కోసం వెళ్లారు...
# ఉగ్ర మూకల బారిన పడ్డారు

- ఇన్‌స్టా ఉద్యోగ ప్రకటనతో మోసపోయిన ఇంజనీరింగ్ నిరుద్యోగులు
- థాయ్‌ల్యాండ్ వచ్చిన వారిని మయన్మార్‌కు తరలింపు
- డ్రగ్స్ తీసుకోవాలంటూ చిత్రహింసలు
- రక్షించాలని తల్లిదండ్రులకు ఫోన్
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌ను కలిసిన తల్లిదండ్రులు

విజయనగరం, జూలై 12(ఆంధ్రజ్యోతి): మెరుగైన ఉపాధి అవకాశాల కోసం విదేశాలకు వెళ్లిన యువత ఉగ్ర, డ్రగ్స్ ముఠాల చేతుల్లో చిక్కుకోవడంతో స్థానికంగా వారి తల్లిదండ్రులు విలవిలలాడుతున్నారు. తమ పిల్లలను రక్షించి, సురక్షితంగా స్వస్థలాలకు రప్పించాలంటూ కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. మే నెలలో ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ ఉద్యోగ ప్రకటన వచ్చింది. ఆకర్షణీయమైన ప్యాకేజీ కావడంతో విశాఖపట్నం నుంచి ముగ్గురు, విజయనగరం నుంచి ఇద్దరు, కడప జిల్లా నుంచి నలుగురు, హైదరాబాద్ నుంచి ముగ్గురు.. మొత్తం 12 మంది దరఖాస్తు చేసుకున్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన థాయ్‌ల్యాండ్ ప్రతినిధులతో వారు మాట్లాడారు. ఇంజనీరింగ్ చేసి, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న నిరుద్యోగ యువత... ప్రకటనదారులు చెప్పిన తీయని, ఆకర్షణీయమైన కబుర్లను నమ్మారు. వారు సూచించినట్లుగా వారివారి ప్రాంతాల నుంచి బయలుదేరి మే 9న థాయ్‌ల్యాండ్‌కు చేరుకున్నారు. థాయ్‌ల్యాండ్‌లో మొదటి రోజు చక్కగా చూసుకున్న ప్రకటనదారులు... ఆ మరుసటి రోజునే ఉద్యోగం కోసం వచ్చిన వారికి ముసుగులు వేసి మయన్మార్ తరలించారు. వారి కుటుంబ సభ్యులు చెప్పిన సమాచారం మేరకు... ఉద్యోగార్థులందరినీ మయన్మార్‌లో ఒక నది ఒడ్డున ఉన్న క్యాంప్‌లో ఉంచారు. చిత్రహింసలు పెట్టారు. డ్రగ్స్ తీసుకోవాలంటూ ఒత్తిడి చేశారు. నిరాకరించిన వారిపై విచక్షణారహితంగా దాడి చేశారు. వెళ్లిన 12 మందిలో విశాఖ, హైదరాబాద్‌కు చెందిన వారు ఇద్దరు... వారి చెర నుంచి తప్పించుకొని స్వస్థలాలకు చేరుకున్నారు. మిగిలిన 10 మంది అక్కడే ఉన్నారు. ఎవరూ లేని సమయంలో తల్లిదండ్రులకు ఫోన్‌లో తమ పరిస్థితిని బాధితులు వివరించారు. తామున్న ప్రాంతం లొకేషన్‌ను షేర్ చేశారు. తమను రక్షించాలంటూ కన్నీరు పెట్టుకున్నారు. దీంతో బెంబేలెత్తిన తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఇప్పటికే కడప, హైదరాబాద్ ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. ఇదే విషయంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అనితలను బాధితుల కుటుంబ సభ్యులు కలిశారు. స్పందించిన పవన్ కల్యాణ్, లోకేశ్ విదేశాంగ మంత్రిత్వ శాఖతో మాట్లాడారు. ఆ ఉగ్రమూకల చెరలో మనదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 200 మంది వరకూ ఉన్నట్లు సమాచారం. తాము చేసుకున్న విన్నపాలపై ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలూ లేకపోవడంతో బాధితుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రాణాలతో తమ పిల్లలను ఇళ్లకు చేర్చాలని వారు కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

## రాష్ట్రానికి 5 స్వచ్ఛ అవార్డులు

- 17న రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోనున్న మంత్రి నారాయణ

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఐదు నగరాలకు జాతీయ స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు వచ్చాయి. 'సూపర్ స్వచ్ఛ లీగ్ సిటీస్' విభాగంలో 10 లక్షల జనాభాపైబడిన నగరాల్లో విజయవాడ, 3-10 లక్షలకు మధ్య ఉన్న నగరాల్లో గుంటూరు, 50 వేలు - 3 లక్షల మధ్య ఉన్న నగరాల్లో తిరుపతి అవార్డులు గెలుచుకున్నాయి. 'మినిస్టీరియల్ అవార్డ్ ప్రత్యేక కేటగిరి'లో జీవీఎంసీ విశాఖపట్టణం, మినిస్టీరియల్ అవార్డు రాష్ట్ర స్థాయి కేటగిరిలో రాజమండ్రికి అవార్డులు వచ్చాయి. ఈనెల 17న ఢిల్లీలో జరిగే ఓ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా మంత్రి పొంగూరు నారాయణ ఈ అవార్డులను అందుకోనున్నారు. అవార్డుల రాకపై స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర ఉద్యమ ఫలితంగానే జాతీయ స్థాయిలో రాష్ట్రంలోని ఐదు నగరాలు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు సాధించాయని అన్నారు. జాతీయస్థాయిలో స్వచ్ఛ అవార్డులు సాధించడంలో విజయవాడ, గుంటూరు. తిరుపతి, విశాఖపట్నం, రాజమండ్రి నగర ప్రజల భాగస్వామ్యం ఎంతో ఉందన్నారు. అవార్డులు రావడానికి శ్రమించిన అధికారులు, పారిశుద్ధ్య సిబ్బందికి పట్టాభి అభినందనలు తెలిపారు.

విద్యుత్‌ను ఆదమరుపుగా, తగిన జాగ్రత్తలు తీసుకోకుండా పట్టుకుంటే షాక్ తప్పదు. పెనుప్రమాదాలు సంబవిస్తాయి. ఈ ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని రైతులు, ప్రజలు జాగ్రత్తలు వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కరెంట్ ప్రమాదాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పూర్తిగా వ్యవసాయ ప్రాంతం కావడంతో తరచూ పంటపొలాల్లో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా పామాయిల్ తోటలలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పంట గెలలు కోసే సమయంలోనే ఎక్కువగా విద్యుత్ తీగలు తగిలి పలువురు మృత్యువాత పడుతున్నారు. వీటితో పాటు ఈదురుగాలులు వీచిన సమయంలో విద్యుత్ తీగలు తెగి పడిన సందర్భంలోను, సాధారణంగా సాంకేతిక ఇబ్బందుల కారణంగా వైర్లు తెగి రహదారులపై పడినప్పుడు వాటిని తగలడంతో పలువురు మృత్యువాత పడుతున్నారు. ఈ ప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

ఏలూరుసిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి) :

# అజాగ్రత్తగా పట్టుకుంటే షాక్





రోజురోజుకు పెరుగుతున్న విద్యుత్ ప్రమాదాలు

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో విద్యుత్ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా వర్షాకాలం సమయంలో అధికంగా జరుగుతూ ఉంటాయి. పంటపొలాల్లోనే కాకుండా ఇళ్లల్లోనూ విద్యుత్ వైరింగ్ సరిగా లేకపోతే షార్ట్ సర్క్యూట్ వంటి వాటి వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిలో గణాంకాల్లోకి వచ్చేవి కొన్నే అయితే రానివి మరెన్నో ఉన్నాయనడంలో సందేహం లేదు. ఈదురు గాలుల సమయంలో విద్యుత్ తీగలు తెగిపడిన సందర్భంలో పొలాల నుంచి వచ్చే రైతులు మృత్యువాత పడడంతో పాటు, ఎప్పుడో వేసిన విద్యుత్ లైన్ల వల్ల పామాయిల్ తోటలు విరివిగా పెరగడం, వాటి గెలలు కోసే సమయంలో కోసే వస్తువులు విద్యుత్ తీగలకు తగలడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. ఏది ఏమైనా విద్యుత్ ప్రమాదాలు అరికట్టటానికి విద్యుత్ శాఖ ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నా ప్రమాదాలు జరగటం శోచనీయం. విద్యుత్ ప్రమాదాలు మానవులకే కాదు జంతువులు కూడా బలి అవుతున్నాయి. పొలాల్లో గడ్డి మేత మేసే సమయంలో తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి పశువులు మృత్యువాత పడుతున్నాయి.

విద్యుత్ ప్రమాదాల నివారణకు అధికారులు ఎప్పటికప్పుడు విద్యుత్ కండక్టర్లను మారుస్తూనే ఉన్నారు. అయినప్పటికీ జరుగుతున్న ప్రమాదాలకు కారణాలు గుర్తించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

### ఏటా పెరుగుతున్న ప్రమాదాలు..

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో విద్యుత్ ప్రమాదాలు ప్రతీ ఏటా పెరుగుతూనే ఉన్నాయని అధికారుల నివేదికలు చెబుతున్నాయి. 2021-22లో 54 మంది మృతి చెందారు. 2022-23లో 47 మంది, 2023-24లో 36 మంది, 2024-25లో ఇప్పటివరకు 21 మంది, జిల్లా విభజన తర్వాత 2025-26లో ఏలూరు జిల్లాలో ఇప్పటివరకు ఆరుగురు మృతి చెందారని విద్యుత్ శాఖ నివేదికలు చెబుతున్నాయి.

### అందించిన నష్టపరిహారం ఇలా..

విద్యుత్ ప్రమాదాలు జరిగిన వెంటనే నష్టపరిహారం కోసం అధికారులు కృషి చేస్తారు. కాని పరిహారం రావడానికి జాప్యం జరుగుతూనే ఉంటుంది. ఇప్పటివరకు మూడేళ్లలో (2021-22 నుంచి 2024-25వరకు) విద్యుత్ ప్రమాదాల వల్ల 158 మంది వ్యక్తులు మృతి చెందగా వారికి సంబంధించి నష్టపరిహారాన్ని బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ ఏడాదిలో చనిపోయిన ఆరుగురికి నష్టపరిహారం ప్రతిపాదనలు పంపించారు.

- ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాల్సిందే..
- వర్షాకాలంలో మరింత అప్రమత్తత అవసరం

### గృహ వినియోగదారులకు సూచనలు

- ఇంటికి ఎర్తింగ్ ఇచ్చినప్పుడు కనీసం రెండు ఎర్త్ ఎలక్ట్రోడ్‌లను అమర్చాలి. అసాధారణ శబ్దాలు గ్రైండర్, ఏ.సి , రిఫ్రిజిరేటర్‌లో వచ్చినప్పుడు అశ్రద్ధ చేయకుండా నైపుణ్యం కలిగిన వారి చేత మాత్రమే పరీక్షించాలి.
- ఒకే ప్లగ్ పాయింట్ నుంచి లూజ్‌వైర్లు/ టెంపరరీగా అనేకమైన పరికరాలను కలపకూడదు. ప్లగ్‌ను తీసిన పుడు వైరును లాగరాదు. గృహవిద్యుత్ ఉపకరణాలను వాడేటప్పుడు వాటి తయారీదారు నిర్దేశించిన సామర్థ్యం కలిగిన మూడు పిన్స్ ప్లగ్ సాకెట్లనే వాడుతూ మూడో పిన్నును విధిగా ఎర్తింగ్ చేయాలి.

### రైతులకు సూచనలు ఇలా..

- ఎక్కడైనా విద్యుత్ వైర్లు కిందికి వేళాడుతున్నప్పుడు మధ్యలో స్తంభాలు ఏర్పాటు చేయాలి. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించి, వాటి స్థానే కొత్తవి ఏర్పాటు చేయాలి. దెబ్బతిన్న కండక్టర్లు(వైర్లు)ను తీసివేసి కొత్త కండక్టర్లు ఏర్పాటు చేసుకోవాలి.
- వ్యవసాయ పంపు సెట్లకు సంబంధించి మోటార్ స్టార్టర్లు, స్విచ్‌లు ఉన్న ఇనుప బోర్డులకు విధిగా ఎర్తింగ్ చేయాలి. విద్యుత్ షాక్ తగులకుండా ఉండేందుకు 30ఎంఏ సామర్థ్యం కలిగిన ఆర్‌సీసీబీని మాత్రమే ఉపయోగించాలి. తడి చేతులతో, నీటిలో నిలబడి విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను మరమ్మతు నిమిత్తమై ఎక్కరాదు.
- పామాయిల్ తోటలలో గెలలు కోసేటప్పుడు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. గెలలు కోసే ముందు రైతులు విద్యుత్ సిబ్బందికి తెలపాలి. అక్కడ వైర్లు పరిస్థితి ఎలా ఉందో విద్యుత్ సిబ్బంది పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చే అవకాశం ఏర్పడుతుంది. ఈదురుగాలులు వీచిన సమయంలో గాని , ఇతరత్రాగాని విద్యుత్ వైర్లు తెగి పడితే వెంటనే 1912కు ఫోన్ ద్వారా తెలపాలి.
- ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తిని రక్షించే ప్రయత్నంలో చేతులతో తాకకుండా ఎండుకర్రతో విద్యుత్ తీగను ప్రమాదానికి గురైన వ్యక్తి నుంచి వేరుచేయాలి.

### వాణిజ్య సముదాయాల వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- కరెంటుకు సంబంధించిన పనులు చేసేటప్పుడు విధిగా చెప్పులు, చేతి తొడుగులు ధరించి చేయాలి. కాటన్ మిల్స్ వారు ప్యానల్ బోర్డు మీద మోటార్ల మీద కాటన్ డస్టు లోనికి వెళ్ళకుండా జాగ్రత్త వహించాలి. అన్ని స్విచ్ బోర్డులకు పానెల్ బోర్డులు ముందు రబ్బరు మ్యాట్లు విధిగా ఏర్పాటు చేసుకోవాలి.



వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో వేచి ఉన్న భక్తులకు మంచినీరు అందిస్తున్న సేవా సిబ్బంది

## మార్మోగిన గోవింద నామస్మరణ

- ద్వారకాతిరుమల క్షేత్రంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గోవిందనామాలతో శ్రీవారి క్షేత్ర ఆలయ ప్రాంగణం శనివారం మార్మోగింది. స్వామికి ప్రీతికరమైన రోజుకావడంతో ఆలయానికి ఉదయం నుంచి భక్తులు రాకతో భక్తుల రద్దీ పెరిగింది. ఆషాఢ మాసం శూన్యమాసమైనా దాదాపు 20 వేల మంది భక్తులు వచ్చారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎండవేడి అధికంగా ఉండడంతో క్యూలైన్ల వద్ద, వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్ద భక్తులు ఎక్కువగా తిరిగే ప్రాంతాల్లో ఆలయ సిబ్బంది, సేవాసంఘాల సిబ్బంది మంచినీరు అందజేశారు. చల్లని నీడ కోసం భక్తులు చెట్ల నీడకు పరుగులు తీశారు. భక్తులు మొక్కుబడులు తీర్చుకుని స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం తీర్థ, అన్నప్రసాదాలను స్వీకరించారు.

## కేసుల తీర్పుల్లో నాణ్యత లోపించకూడదు

- ఉమ్మడి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ సురేష్‌రెడ్డి




కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జస్టిస్ సురేష్‌రెడ్డి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

ఏలూరు క్రైం, జూలై12(ఆంధ్రజ్యోతి) : కేసుల తీర్పులు త్వరితగతిన వెలువరించాలని, తీర్పులలో నాణ్యత లోపించకూడదని న్యాయ మూర్తులకు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, ఉమ్మడి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ కె.సురేష్‌రెడ్డి సూచించారు. శనివారం ఏలూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని న్యాయమూర్తులతో జ్యుడీషియల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయమూర్తులు కేసులను త్వరితగతిన విచారించి తీర్పులు వెలువరించాలన్నారు. సివిల్ కేసులు, విచారణలో ఉన్న ఖైదీల కేసులను త్వరితగతిన తీర్పులను వెలువరించడానికి ప్రయత్నించా లన్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని కోర్టులలో ఉన్న పెండింగ్ కేసులు వివరాలు, భవన సముదాయాల పరిస్థితులపై వివరించారు. జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు పాల్గొన్నారు.

## పట్టిసీమ నుంచి 7,788 క్యూసెక్కుల విడుదల



పట్టిసీమ ఎత్తిపోతల నుంచి నీటి విడుదల

పోలవరం, జూలై 12(ఆంధ్రజ్యోతి): పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 7,788 క్యూసెక్కుల జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేశామని ఈఈ యేసుబాబు శనివారం తెలిపారు. గోదావరి నీటిమట్టం 18 మీటర్లకు పైబడి ఉండడంతో 22 మోటార్లు 22 పంపుల ద్వారా నీటి విడుదల చేశామన్నారు. కృష్ణా ఉమ్మడి పశ్చిమ డెల్టాల సాగునీటి అవసరాల రీత్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మోటార్లు, పంపుల సంఖ్య పెంచామన్నారు.

# నడకతోనే ఆరోగ్యం

- వ్యాయామంపై పెరిగిన ఆసక్తి





ఉమ్మడి పశ్చిమ జిల్లాలో 80 వ్యాయామ శాలలు... 1.50 లక్షల మంది వాకర్స్

ప్రస్తుత సమాజంలో చిన్నాపెద్ద, ధనిక పేద ఎవరి నోట విన్నా వ్యాయామం అనే మాట వినిపిస్తుంది. శారీక వ్యాయామం తగ్గిన నేటి పరిస్థితుల్లో పౌరులు నడక, వ్యాయామంపై దృష్టి పెడుతున్నారు. వ్యాయామం, యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని గ్రహించారు. ఆసక్తి పెరిగింది. ఉదయం వాకింగ్ చేసే వారి సంఖ్య, జిమ్‌లకు వెళ్లి వ్యాయామం చేసే వారి సంఖ్య పెరిగింది. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

పాలకొల్లు జూలై 12(ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రస్తుతం సుమారుగా 80 వ్యాయామశాలలు ఉన్నాయి. లక్షా 50వేల మంది ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ రోజూ నడుస్తున్నారు. జిల్లాలో 80 వాకర్స్ క్లబ్‌లు ఉండగా వేల సంఖ్యలో వాకర్స్ నిత్యం నడుస్తూ పలువురిని నడిపిస్తున్నారు. రెండు మూడు దశాబ్దాలకు వెనక్కి వెళితే కార్మిక కర్షక వర్గాలతో పాటు 50శాతం పైబడి పౌరులకు శారీరక శ్రమ ఉండేది, పేద మధ్య తరగతి వర్గాలలో 90శాతం పైబడి పురుషులు సైకిళ్లు తొక్కేవారు. ఇంటి పట్టున ఉండే మహిళలు బట్టలు ఉతకడం, పిండి రుబ్బడం, అంట్లుతోమడం, ఇంటికి చాకిరీ చేసుకుంటూ శరీరానికి తగినంత పని కల్పించే వారు.. నేడు ఇంటి వద్ద ఉండే మహిళలకు శారీరక శ్రమ లేకుండా కట్టెల పొయ్యి స్థానంలో గ్యాస్ స్టవ్‌లు వచ్చేశాయి. రుబ్బురోలుతో పనిలేకుండా మిక్సీలు, గ్రైండర్లు అందుబాటులో ఉన్నాయి. బట్టలు ఉతికేందుకు వాషింగ్ మిషన్లు, చివరకు ఇంటిలో చీపురు అవసరం లేకుండా వాక్యూం మిషన్లు, సంప్రదాయ ఆహారం స్థానంలో ఫాస్ట్, జంక్ ఫుడ్‌లు ఇలా దైనందిన జీవితంలో అన్నింటా మార్పులు రావడంతో ఊబకాయాలు పెరగడమే కాకుండా బీపీ, షుగర్ వంటి రోగాల బారిన పడుతున్నారు. ఇప్పుడు కూలీలుపని చేసుకునే కార్మికవర్గాలు సైతం బైక్ లేనిదే కాలు బయట పెట్టడం లేదు. కాలినడక, సైక్లింగ్ పూర్తిగా మర్చిపోయారు పేద, సామాన్య, మధ్య తరగతి వర్గాల ప్రజలు బైక్‌లు స్కూటీలు వాడుతుంటే మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి వారు కార్లు వాడుతున్నారు ఈ పరిస్థితుల్లో వ్యాయామం లేక రోగాలను కొని తెచ్చుకుంటున్నారు. ఈవిధంగా రోగాల బారిన పడుతున్నవారికి సమతుల్య ఆహారం అందిస్తామంటూ కొన్ని ఆహార కేంద్రాలు పుట్టుకొస్తున్నాయి. వాటి వల్ల ఉపయోగం ఉందో లేదో కానీ, సొమ్ములు దండీగానేలాగేస్తున్నాయి. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఇప్పుడు సుమారు 42 లక్షల మంది జనాభా ఉండగా అందులో సుమారు 2 లక్షల మంది మైదాన ప్రాంతాలు, రహదారులు వెంబడి పార్కులలోనూ వాకింగ్ చేస్తుండగా సుమారు 2 లక్షల మంది మహిళలు ఇంటివద్దనే ఉంటూ తేలికపాటి నడకవంటి వ్యాయామాలు చేస్తున్నారు. ఇప్పుడు పలు వ్యాయామ శాలలో పౌరుల వయస్సును బట్టి వ్యాయామ శిక్షణ అందిస్తున్నారు. నిత్యం 30 నిమిషాలు తక్కువ కాకుండా వ్యాయామం చేస్తే శరీరంలో ఉండే చెడు కొవ్వు తగ్గడమేకాకుండా స్థూల కాయం నియంత్రించడం బీపీ, షుగర్ వంటి వ్యాధులు అదుపులోకి రావడం, ముఖ్యంగా శరీర పటుత్వం పెరిగిన కంటి చూపు మెరుగు పడడం. ఆయువు పెరగడం వంటి ప్రయోజనాలు ఉన్నాయని వ్యాయామ శాలల నిర్వాహకులు, వైద్యులు చెబుతున్నారు.

### 25 ఏళ్లుగా వ్యాయామం చేస్తున్నా..



గత 25 ఏళ్లగా క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తున్నా. దీని వల్ల ఏవిధమైన అనారోగ్య సమస్యలు తలెత్తలేదు. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు లేవు ఒకటి.. రెండుసార్లు తప్ప జ్వరం కూడా రాలేదు. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే ఫిట్నెస్‌తో పాటు మానసికంగా ఉత్సాహంగా ఉంటుంది.

\- గాదె వెంకన్న
ఆధ్యాత్మిక వేత్త, పాలకొల్లు

### వ్యాయామానికి ప్రాధాన్యం పెరిగింది



గత 16 ఏళ్లుగా జిమ్ కోచ్‌గా పనిచేస్తున్నా. 12 ఏళ్ల నుంచి సొంతంగా వారాహి జిమ్ పేరుతో జిమ్ నిర్వహిస్తున్నా. పురుషులతో పాటు, మహిళలు జిమ్‌కు వస్తున్నారు. రోజుకు స్త్రీ, పురుషులతో కలిపి 150 మంది వరకు శిక్షణ పొందుతున్నారు. యువత జిమ్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.

\- మడ్డు వాసు
జిమ్ నిర్వాహకుడు, పాలకొల్లు

## క్రైమ్ సమాచారం

### అపార్టుమెంటు వాచ్‌మన్ ఆత్మహత్య



శ్రీను మృతదేహం

ఏలూరు క్రైం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఒక అపార్టుమెంటులో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న ఓవ్యక్తి అనుమానాస్పదస్థితిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామానికి చెందిన పచ్చిపాల శ్రీను (30)కు 2020లో వివాహమైంది. అతడికి భార్య, ఒక కుమారుడు ఉన్నాడు. నెల రోజుల క్రితం ఏలూరు శాంతినగర్ మూడో రోడ్డులోని అపార్టుమెంటులో వాచ్‌మన్‌గా చేరి కుటుంబంతో ఉంటున్నాడు. పగటి వేళ తాపీ పనులకు వెళ్తున్నాడు. తాను ఉంటున్న గదిలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి భార్య ఫిర్యాదు మేరకు ఏలూరు త్రీటౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం జరిపించి బంధువులకు అప్పగించారు. అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



రాము మృతదేహం

కలిదిండి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కలిదిండి మండలం మూల్లంక గ్రామానికి చెందిన మామిడిశెట్టి రాము(45) చేపల చెరువుపై కాపలా ఉంటున్నాడు. భార్య కువైట్‌లో ఉంటోంది. కుటుంబ సమస్యలతో కొంతకాలంగా అతడు మద్యానికి బానిస య్యాడు. రోజురోజుకు సమస్యలు తీవ్రమవడంతో మనస్తాపానికి గురై శుక్రవారం రాత్రి చేపల చెరువు వద్ద విషపూరిత గ్యాస్ బిళ్లలను నీటిలో కలుపుకుని తాగేశాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన వైద్యం నిమిత్తం కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. అతడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఏఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బైక్ అదుపుతప్పి మహిళ మృతి

పోడూరు, జూలై12(ఆంధ్రజ్యోతి):పాలకొల్లు-పెనుమదం రోడ్డులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి.. పాలకొల్లు రామయ్యహేలు నగర్‌కు చెందిన దిగమర్తి ప్రమీళ(30) పాలకొల్లు నుంచి పెనుమదం స్కూటీ వాహనంపై చర్చికి వెళ్తుంది. ఈక్రమంలో రోడ్డు మధ్యలో వున్న గొయ్యిని తప్పించబోయి అదుపు తప్పి పడి పడిపోయింది. రాత్రి సమయంలో రోడ్డుపై ఉన్న గొయ్యి కనబడకపోవడంతో ఈ ప్రమాదం జరిగింది. ఆమెకు వివాహమైనప్పటికీ భర్తతో గొడవ కారణంగా వేర్వేరుగా ఉంటున్నారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి తండ్రి వీధి గనిరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## లారీని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

- ఏడుగురికి తీవ్ర గాయాలు



లారీని ఢీకొట్టడంతో నుజ్జునుజ్జయిన బస్సు ముందు భాగం

ఏలూరు క్రైం, జూలై 12(ఆంధ్రజ్యోతి): విశాఖపట్టణం నుంచి చెన్నై వెళ్తున్న ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు 16వ నంబరు జాతీయ రహదారి గుండుగొలను వద్ద ముందు వెళ్తున్న లారీని శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఏడుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. విశాఖపట్టణం నుంచి ఎంఆర్ఎం ప్రైవేటు ట్రావెల్ బస్సు వైజాగ్‌లో శుక్రవారం రాత్రి పదకొండు గంటలకు బయలుదేరింది. అర్ధరాత్రి దాటిన తరువాత భీమడోలు మండలం తిరుమల డైరీ సమీపంలో ముందు వెళ్తున్న లారీని అతి వేగంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో తమిళనాడు మధురైకి చెందిన బస్సు డ్రైవర్ సురేష్ సుభాష్, కర్ణాటకలోని ఉబ్బివెళ్ళి గ్రామానికి చెందిన జానప్ప వెంకటేష్, బెంగళూరుకు చెందిన శ్రీరామ్, ములగలేటి శ్రీకాంత్, శ్రీకాకుళం జిల్లా నందిగామ గ్రామానికి చెందిన నితీష్‌కుమార్, తునికి చెందిన పాడి హిమగంగ, విశాఖపట్టణానికి చెందిన జాజుల చంద్రకళ తీవ్ర గాయాలకు గురయ్యారు. ప్రమాద సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రులను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి శనివారం తెల్లవారు జామున చేర్పించారు. ఈ ఘటనపై భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బాలిక అదృశ్యమంటూ వాట్సాప్‌లో మెసేజ్

ఎస్పీ ఆదేశాలతో ఆచూకీ కనుగొన్న శక్తి టీమ్

ఏలూరు క్రైం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఒక బాలిక ఇంట్లో అలిగి ఇల్లు విడిచిపెట్టి వెళ్లిపోవడంతో వాట్సాప్‌లో ఆ బాలిక ఫొటో రావడంతో వెంటనే ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాల మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, శక్తి టీమ్ పోలీస్ సిబ్బంది కలిసి బస్టాండ్‌లో ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ ఉన్న ఆ బాలికను శనివారం సాయంత్రం గుర్తించారు. ఆ బాలిక భీమవరంలోని తన కుటుంబ సభ్యులపై కోపంతో అలిగి వచ్చేసినట్టుగా గుర్తించారు. బాలికను సంరక్షణ నిమిత్తం వన్‌స్టాప్ సెంటర్‌కు తరలించారు. బాలిక సమాచారం కుటుంబ సభ్యులకు అందించారు.



మృతుడి కుటుంబంతో గ్రామస్థుల ధర్నా

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

న్యాయం చేయాలంటూ బాధితుల ధర్నా

ఆగిరిపల్లి, జూలై12 (ఆంధ్రజ్యోతి):నెక్కలం అడ్డరోడ్డు వద్ద శుక్రవారం కోడిగుడ్ల వ్యాను ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులు న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించారు. వారికి బాసటగా గ్రామస్తులు ధర్నా చేసిన ఘటన శనివారం నెక్కలం గొల్లగూడెంలో జరిగింది. నెక్కలం గొల్లగూడెంకి చెందిన పటాపంచల గంగరాజు (35) శుక్రవారం ద్విచక్ర వాహనంపై ఆగిరిపల్లి వస్తుండగా, ఎన్టీయార్ జిల్లా నున్న నుంచి కోడిగుడ్ల కోసం ఆగిరిపల్లి వస్తున్న వ్యాన్ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు తీవ్ర గాయాలపాలవ్వగా చికిత్స కోసం విజయవాడ తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. శనివారం మధ్యాహ్నం మృతుడి కుటుంబసభ్యులు, గ్రామస్థులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ వారికి సరైన న్యాయం జరగకపోవడంతో నెక్కలం గొల్లగూడెంలో మధ్యాహ్నం రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ, నూజివీడు టౌన్ సీఐ, ముసునూరు, నూజివీడు టౌన్, నూజివీడు రూరల్ ఎస్ఐ ధర్నా ప్రాంతానికి చేరుకున్నారు. గ్రామ పెద్దలు, నూజివీడు డీఎస్పీ వద్ద చర్చలు జరపడంతో ప్రమాదానికి కారణమైన వాహన యజమానులతో చర్చించి, ఎట్టకేలకు ఈ సమస్యను డీఎస్పీ పరిష్కరించడంతో ధర్నా విరమించారు. సుమారు మూడున్నర గంటలకుపైగా ధర్నా నిర్వహించడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## వస్త్రదుకాణంలో అగ్నిప్రమాదం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తణుకు, జూలై12(ఆంధ్రజ్యోతి): తణుకు పట్టణంలోని ఆలమూరి వీధిలో ఉన్న వస్త్రదుకాణంలో అగ్నిప్ర మాదం ఆదివారం తెల్లవారు జామున జరిగింది. ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణంగా షాపులో వస్త్రాలు కాలిపోయాయి. అంజన టవర్స్‌లోని మొదటి అంతస్తులోని ఫ్యాన్సీ షాపు, వస్త్రాలు ఉన్నాయి. ఆయా షాపులకు సంబంధించి అగ్ని ప్రమాదం జరిగింది. తణుకు అగ్నిమాపక వాహనం మరమ్మతుల కారణంగా అత్తిలి వాహనం, సిబ్బంది వచ్చి పూర్తిగా మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో సుమారు రూ.10లక్షల ఆస్తినష్టం జరిగిందని భావిస్తున్నారు. అత్తిలి అగ్నిమాపకాధికారి గంగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంతుచిక్కని వ్యాధితో మేకలు మృత్యువాత!

- మూడు రోజుల్లో 9 మేకలు మృతి



విగతజీవులుగా పడి ఉన్న మేకలు

ఆగిరిపల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి):అంతుచిక్కని వ్యాధి సోకి మేకలు మృతి చెందడంతో వడ్లమాను గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజుల వ్యవధిలో ఒకే రైతుకు చెందిన తొమ్మిది మేకలు మృతి చెందాయి. సాదం స్వామి సుమారు 30 మేకలతో జీవనం సాగిస్తుండగా, గురువారం ఒక మేక, శుక్రవారం 4, శనివారం మరో 4 మృతి చెందాయి. శుక్రవారం స్థానిక పశువైద్య సిబ్బందికి తెలియపరచడంతో వారు వచ్చి చూసినప్పటికి వ్యాధి అర్థం కాలేదని బాధితుడు వాపోయాడు. శనివారం మరికొన్ని మేకలు చనిపోవడంతో ఎంపీటీసీ ఆర్.సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ జలసూత్రం వంశీకృష్ణకు తెలపగా వారు పశువైద్యాధికారి హనుమంతరావుకు సమాచారం ఇవ్వడంతో సిబ్బందితో వచ్చి మేకలకు చికిత్స నిర్వహించారు. మృతిచెందిన మేకల విషయంపై నివేదికను ఉన్నతాధికారులకు తెలియపరుస్తానన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు స్వామి, గ్రామస్తులు కోరుతున్నారు.

## సుదర్శన కల్యాణ వేంకటేశ్వర స్వామికి పూజలు

పోలవరం, జూలై 12(ఆంధ్రజ్యోతి): పట్టిసీమ భూదేవి శ్రీదేవి సమేత సుదర్శన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తుల తాకిడి పెరిగింది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి భక్తులు కాలినడకనవచ్చి తొమ్మిది శనివారాలు స్వామికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ దర్శనానికి వచ్చిన భక్తులకు కమిటీ మహిళలు పులిహోర చక్కెరపొంగలి ప్రసాదాలు పంపిణీ చేసి మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.





## మధ్యాహ్న భోజనం కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించండి

కుక్కునూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన వర్కర్లు, స్కూల్ స్వీపర్ల సమస్యలు పరిష్కరించి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ మండలాధ్యక్షులు, కార్యదర్శి కుంజా నాగలక్ష్మి, వై.సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కుక్కునూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగభద్రత కల్పిస్తూ వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దుర్గమ్మ, సీత, కీర్తి, రత్నమ్మ, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీలకు ఉచిత సోలార్

» కనెక్షన్లకు పూర్తయిన సర్వే » ప్రభుత్వానికి నివేదిక పంపిన అధికారులు



ఏలూరు రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగాన్ని తగ్గించి సోలార్ విద్యుత్ వాడకాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ కనెక్షన్ పథకాన్ని ప్రవేశపెట్టింది. సూర్యఘర్ పేరిట ఈ సోలార్ కనెక్షన్ల నిమిత్తం లబ్ధిదారులకు సబ్సిడీపై అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు కృషి చేస్తోంది. ముఖ్యంగా ఎస్సీలకు సంబంధించి ప్రభుత్వం 2 కిలో వాట్స్ పూర్తిగా ఉచితంగా సోలార్ కనెక్షన్లు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. ఎస్సీలకు సంబంధించి అర్హత కలిగిన ప్రతి ఇంటికి సోలార్ కనెక్షన్‌ను వంద శాతం రాయితీతో ప్రభుత్వం సమకూర్చనుంది. ఈమేరకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సర్వే పూర్తయ్యింది. ఏలూరు రూరల్ మండలంలో ఈ పథకానికి అర్హత ఉన్నవారు మొత్తం 1000 మంది లబ్ధిదారులను గుర్తించారు. వీరందరికి ఉచితంగా సోలార్ కనెక్షన్లు అందించనున్నారు. మండలంలో సర్వే పూర్తయ్యింది. సర్వే అనంతరం ప్రభుత్వ అనుమతుల కోసం ఇప్పటికే నివేదికను పంపారు. అనుమతులు వచ్చిన వెంటనే తదుపరి కార్యాచరణను ప్రారంభించనున్నారు.

### అనుమతి రాగానే ఏర్పాటు

అనుమతులు రాగానే సోలార్, సిస్టమ్‌ను ఎస్సీ ఇళ్ళకు ఏర్పాటు చేస్తాం. మరో పక్క బీసీలకు సంబంధించి కూడా ఈ సోలార్ సిస్టమ్‌ను అందించేందుకు వీలుగా అర్హులైన వారి ఇళ్ల సర్వే జరుగుతోంది. ఇప్పటి వరకు బీసీలకు ప్రభుత్వం సోలార్ ఏర్పాటు చేసుకునేందుకు రూ.78 వేలు సబ్సిడీ ఇస్తుండగా, అదనంగా మరో రూ.20 వేలు పెంచి మొత్తం రూ.98 వేలు మేర సబ్సిడీని ఇస్తోంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అర్హులైన వారంతా సోలార్ సిస్టమ్ విద్యుత్ వినియోగించుకుని ప్రభుత్వం అందించే సబ్సిడీ ప్రయోజనాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి.



శ్రీనివాస్, ఏలూరు రూరల్ ఏఈ



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ కృష్ణ

## ఉచిత మెగా వైద్య శిబిరం

ఏలూరురూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ ఆర్థోపెడిక్ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండో శనివారం ఆస్పత్రి ప్రాంగణంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్టు ప్రముఖ ఆర్థో స్పెషలిస్ట్ డాక్టర్ శ్రీకృష్ణ తెలిపారు. దీనిలో భాగంగా ఉచిత వైద్యసేవలతో పాటు, విలువైన రక్తపరీక్షలు చేస్తున్నామన్నారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే రోషన్ కుమార్ పరామర్శ

చింతలపూడి, జూలై 12(ఆంధ్రజ్యోతి):ప్రగడవరం టీడీపీ నాయకులు మానేపల్లి రాజారావు కుమారుడు కిశోర్‌కు మెడపై ఆపరేషన్ జరగడంతో ఎమ్మెల్యే రోషన్ కుమార్ స్వయంగా విజయవాడ మణిపాల్ ఆస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి కిశోర్ కుటుంబానికి ధైర్యం చెప్పి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట లింగపాలెం నాయకులు చలపతి రావు, పలువురు ఉన్నారు.

## బాధితుడికి సీఎం సహాయ నిధి

ద్వారకాతిరుమల, జూలై 12(ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఓ నిరుపేద యువకుడికి గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సీఎం సహాయ నిధి రూ.3.50 లక్షల చెక్కును అందజేశారు. రామన్నగూడేనికి చెందిన పెచ్చేటి వీరాంజనేయులు కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానిక నేత మద్రాస్ రాము ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఈ చెక్కు మంజూరు చేయించారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పెదపాడు, జూలై 12(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని పెదపాడు ఎస్.ఐ. కట్టా శారద సతీశ్ తెలిపారు. పెదపాడు బస్టాండ్ సెంటర్‌లో స్టేషన్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేశారు. పలువురు వాహనదారులను తనిఖీ చేసి మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్నదీ లేనిదీ పరీక్షించారు. ఎస్.ఐ. సతీశ్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాల బారినపడతారని హెచ్చరించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంలో పోలీసు సిబ్బందికి సహకరించాలని కోరారు.

## నేడు సొసైటీ అధ్యక్షుల ప్రమాణ స్వీకారం

దెందులూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): సీతంపేట కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులుగా పెరుగుగూడెం మాజీ సర్పంచ్ యలమర్తి వీర వెంకట సత్యనారాయణ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, టీడీపీ మండలాధ్యక్షులు మాగంటి మిల్లుబాబు ఆధ్వర్యంలో ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆదివారం కుటుంబ సమేతంగా చల్లచింతలపూడి గ్రామ దేవత పాటిమ్మతల్లికి యలమర్తి సత్యనారాయణ హేమలత దంపతులు అషాఢం సారెను సమర్పిస్తారు. అనంతరం సీతంపేట బ్యాంక్ అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

## సీఆర్‌ఆర్‌లో 14న మెగా జాబ్‌మేళా

ఏలూరుటూటౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 14న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా జరిగే ఈ మెగా జాబ్ మేళాకు 39కంపెనీల ప్రతినిధులు వచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. 3వేల మందిని ఉద్యోగాల కోసం ఎంపిక చేయనున్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీఫాంసీ, ఎంఫాంసీ, బీటెక్, ఎంటెక్, ఫామ్‌డీ తదితర కోర్సులు చేసినవారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 9.30 నిమిషాలకు హాజరుకావాలన్నారు. జాబ్ మేళాకు హాజరయ్యే వారు ముందుగా ఆన్‌లైన్‌లో తమ వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఫార్మల్ డ్రెస్‌లో రెజ్యూమ్‌లు, ప్రింట్‌కాపీలు తీసుకురావాలన్నారు. వివరాలకు (94934 82414, 89785 24022) నెంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

## ఫ్యాప్టో సమావేశంలో బదిలీ టీచర్ల వేతనాలపై చర్చ

ఏలూరు అర్బన్, జూలై 12(ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో కొత్తస్కూళ్లకు మారిన టీచర్లకు పొజీషన్ ఐడీలను క్రియేట్‌చేసి వెంటనే జీతభత్యాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాని శనివారం పవర్‌పేట మున్సిపల్ హైస్కూల్లో జరిగిన ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) సమావేశంలో నాయకులు డిమాండ్ చేశారు. ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ మోహన్‌రావు, సెక్రటరీ జనరల్ ఆదినారాయణ మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్‌ను నియమించి తక్షణమే ఐఆర్‌ను ప్రకటించాలని కోరారు. ఫ్యాప్టో నాయకులు వెంకటేశ్వరరావు, ప్రకాశరావు, రామ్మోహనరావు, ప్రవీణ్ కుమార్, రవికుమార్, శివరామ్, రమేశ్, శ్రీనివాసరావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉండాలి

దెందులూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): మైనార్టీ(ముస్లింల) సమస్యల పరిష్కారానికి వారి ఐక్యంగా ఉండేలా ముస్లిం జమీఅత్ ఉలమా సంఘం బలోపేతానికి సభ్యత్వ నమోదును వేగవంతం చేస్తున్నామని ముస్లిం జమిఅత్ ఉలమా ముస్లిం సంఘ రాష్ట్ర కన్వీనర్ మౌలానా హసీన్ అహ్మద్ అన్నారు. శనివారం దెందులూరు మండలం సోమవరప్పాడు పంచాయతీ పరిధిలోని ఆశ్రమం సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న మదర్సా మసీదులో జమీఅత్ ఉలమా ముస్లిం సభ్యత్వాలపై జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు హఫీజ్ నురుల్ హక్, సోమవరప్పాడు మదర్సా నిర్వాహకులు మౌలానా తీయాకత్‌ల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ముస్లిం సంఘ పెద్దలు మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాలో 7 వేల సభ్యత్వాలు నమోదు చేశామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ : ఎమ్మెల్యే రోషన్

చింతలపూడి, జూలై 12(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నిలిపేందుకు విజన్-2047 యాక్షన్ ప్లాన్ రూపొందించి అమలు చేయాలని, అందుకు ప్రణాళిక రూపొందించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అధికారులకు సూచించారు. క్యాంపు కార్యాలయంలో 2047-యాక్షన్ ప్లాన్‌పై నాలుగు మండలాల అధికారులతో సమీక్షించారు. ప్రధానంగా పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అమలు సూచిస్తూ శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వాలన్నారు. ఈనెల 16న జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ రానున్న నేపథ్యంలో ప్రజంటేషన్ ఇవ్వాలన్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి జిల్లా పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ నెహ్రూ, నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంపీడీవోలు, ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాతో స్థానిక నాయకులు

## టీడీపీ నాయకులతో రాష్ట్ర అధ్యక్షుడు పల్లా సమీక్ష

జీలుగుమిల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి) : మండల అబ్జర్వర్‌లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు క్షేత్రస్థాయిలో పర్యటించి టీడీపీ గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. శనివారం మంగళగిరిలో టీడీపీ గ్రామ కమిటీల ఏర్పాటు విషయమై మండలంలో తలెత్తుతున్న సమస్యల్ని మండల నాయకులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాస రావు నియోజకవర్గ ఇన్‌చార్జి, మండల పరిశీలకులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మాజీ జడ్పీటీసీ బాసిన రాజబాబు, సీనియర్ నాయకులు వనమ వెంకటేశ్వరావు, గూడపాటి పుల్లయ్య, చిర్రి వెంకటేశ్వరావు, గన్నమని సురేష్, తమ్మన సాంబ, గుడిపూటి చిరంజీవి, ఎడ్లపల్లి శేషగిరిరావు, వెలగల అజయ్, అక్కిశెట్టి బలరాం, తదితర నాయకులు ఉన్నారు.

## ఐదు కంకర లారీలు స్వాధీనం

ఉంగుటూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు శివారులో ఐదు కంకర వాహనాలను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం సాయంత్రం సంబంధిత అధికారులకు వచ్చిన సమాచారం మేరకు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. దాడుల సమయంలో ఎలాంటి పత్రాలు అందుబాటులో లేవని, పత్రాలు మరొకరు తీసుకొస్తున్నట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ వై.పూర్ణచంద్ర వర ప్రసాద్ తెలిపారు. ఇదే విషయమై వివరణ కోసం ప్రయత్నించగా చేబ్రోలు ఎస్.ఐ. క్రైం మీటింగ్‌కు వెళ్లడంతో అందుబాటులో లేరు.



ఎద్దువాగు వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఆర్డీవో రమణ

# పెరుగుతూ.. శాంతిస్తూ


(5వ పేజీ తరువాయి)


ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే కొంతమంది భూదేవిపేట, బండ్లబోరు, దాచారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు తరలివెళ్లగా మిగిలిన వారిని తాడువాయి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు తర లించేందుకు చర్యలు చేట్టారు. తహసీల్దార్ కార్యాలయంలో వరదలను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎద్దువాగు వద్ద నీటమునిగిన లోలెవల్ కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని పరిశీలించారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఇతర అధికారులు, జనసేన మండల అధ్యక్షుడు గణేశుల ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు. పోలవరం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వరద జలాలు చుట్టు ముట్టాయి. గోదావరి లంక భూములు నీటమునిగాయి. గండి పోశమ్మ ఆలయం పూర్తిగా నీటమునిగింది.

# ఎన్నాళ్లీ కష్టాలు!


(5వ పేజీ తరువాయి)


కింద పూర్తిగా నష్టపరి హారం చెల్లించి పునరావాస కాలనీల్లో అన్ని సౌకర్యాలు కల్పించి ఉంటే ముంపు మండలాల వాసులకు ఈ కష్టా లు తప్పేవి. కానీ దీనికి భిన్నంగా వరుసగా నాలుగో ఏటా కూడా గోదావరి వరద తాకిడికి పెద్దసంఖ్యలో ప్రజలు ఇళ్లను ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది.

**పొంచి ఉన్న ముప్పు :** గతేడాది భారీ వర్షాల తాకిడికి పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడింది. ఒకవైపు తెలంగాణ, మరోవైపు ఆంధ్రప్రదే శ్‌లు ఈ ప్రాజెక్టు నిర్వహణా వ్యయంలో ఖర్చును భరించాల్సి ఉంది. మరమ్మతు చేయాలన్న ఇదే దామాషా పద్ధతి. ఈ నేపథ్యంలో గతేడాది పెద్దవాగు ప్రాజెక్టుకు నష్టం వాటిల్లితే కేవలం నామమాత్రపు పనులతో సరిపెట్టారు. కానీ ఈసారి మరోసారి భారీ వర్షాలకు ఆస్కారం ఉంటే పెద్దవాగు ప్రాజెక్టు వద్ద చేసిన తాత్కాలిక పనులన్నీ దెబ్బతినే అవకాశం లేకపోలేదు. ఇదే భయంతో దిగువ గ్రామాల్లో ఉన్న స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వేసవిలోనే పెద్దవాగు ప్రాజెక్టుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాల్సిందీ పోయి కాలక్షేపం చేశారు. ఈ కారణంగా పెద్దవాగు ప్రాజెక్టు దిగువన వరద ముంపు పొంచే ఉంది.

# ప్రజల హృదయాల్లో నిలిచిపోయిన మాజీ ఎమ్మెల్యే బుజ్జి

### జయంతి సందర్భంగా పేదలకు వితరణ

ఏలూరుటూటౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసి సుస్థిర స్థానం సంపాదించుకున్న దివంగత మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి స్ఫూర్తితో ముందుకు సాగుతున్నట్టు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. బడేటి బుజ్జి 61వ జయంతిని నిర్వహించారు. బడేటి బుజ్జి జయంతిని పురస్కరించుకుని పేదలకు వీల్‌చైర్‌లు, తోపుడుబండ్లు, కుట్టుమిషన్లు ట్రై సైకిళ్లు, ల్యాప్ ట్యాప్‌లు, చెవిటి మిషన్లు అందజేశారు. అనారోగ్యంగా ఉన్న టీడీపీ కార్యకర్తకు వైద్యం నిమిత్తం రూ.10వేలు అందజేశారు. ఇంటర్ చదివే 250 మంది విద్యార్థులకు యూనిఫాంలు అందజేశారు. 22 మందికి రూ.15 లక్షలు సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. అనంతరం జడ్పీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బడేటి బుజ్జి విగ్రహం వద్ద ఫ్లాష్ టీమ్ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, టీడీపీ నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, ఇడా ఛైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, డిప్యూటీ మేయర్లు వందనాల దుర్గాభవాని శ్రీనివాస్, పప్పు ఉమామహేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఉప్పాల జగదీశ్‌బాబు, ఎస్ఎంఆర్ పెదబాబు, చల్లా వెంకట సత్యవర ప్రసాద రావు, ఈతకొండ శ్రీనివాస్ రావు, బెల్లకొండ కిశోర్ పాల్గొన్నారు.



ట్రై సైకిల్ అందజేస్తున్న ఎమ్మెల్యే చంటి

## ఎర్రచెరువు కాలనీలో ఇళ్లకు పట్టాలివ్వండి

### మంత్రి నిమ్మలకు టీడీపీ నాయకుడి వినతి

టి.నర్సాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎర్రచెరువు కాలనీలో నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలిచ్చి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ పాలకొల్లు క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొండపల్లి రవిని కలిసి శనివారం వినతి పత్రం అందజేశారు. ఎర్రచెరువు ప్రాంతంలో వంద కుటుంబాలపైన నివాసం ఉంటున్నారని వీరికి ప్రభుత్వం పక్కా గృహాల మంజూరు చేసిందని, వీరికి ఇంటి పన్నులు, కుళాయిలు బిల్లులు, కరెంటు బిల్లులు కూడా ఉన్నాయన్నారు. ఏళ్ల తరబడి ఇక్కడే నివాసముంటున్న వీరికి శాశ్వతంగా పట్టాలు మంజూరు చేయాలన్నారు. మంత్రి నిమ్మల రామానాయుడు స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు.



మంత్రికి సమస్య వివరిస్తున్న దృశ్యం

## కమలాంబికా మాత విగ్రహావిష్కరణ

ఏలూరు రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): స్థానిక అగ్రహారంలోని శ్రీరత్న కమలాంబిక సేవాశ్రమంలోని లలిత త్రిపురసుందరి అమ్మవారి సన్నిధిలో కమలాంబికా మాత విగ్రహావిష్కరణ మహోత్సవం వైభవంగా జరిగింది. మైలవరపు గురుశర్మ పర్యవేక్షణలో విశేష పూజలు అర్చనలు హోమాది కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



ర్యాలీలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బంది

## డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ

టి.నర్సాపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): డెంగీ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని చింతలపూడి మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.ఏ.ప్రసాద్ తెలిపారు. జాతీయ డెంగీ మాసోత్సవంలో భాగంగా శనివారం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహించి డెంగీ నివారణపై నినాదాలతో అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే, డ్రైడేగా పాటించడం ద్వారా డెంగీని నివారించవచ్చన్నారు. పీహెచ్ఎన్ మైడమ్మ, మలేరియా హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# అపరిచిత వ్యక్తులతో పరిచయాలు వద్దు



విద్యార్థినులకు సూచనలు చేస్తున్న శక్తిటీమ్

### విద్యార్థినులకు శక్తిటీమ్ అవగాహన

ఏలూరు క్రైం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకోకూడదని, తమ వివరాలు కాని, కుటుంబ వివరాలు కాని చెప్పకూడదని శక్తిటీమ్ పోలీసులు విద్యార్థినులకు సూచించారు.ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్ఐ కాంతిప్రియ, శక్తిటీమ్ బృందాలు ఏలూరు నగరంలోని పలు వసతి గృహాల్లో ఉన్న విద్యార్థినులకు భద్రతపై అవగాహన కల్పించారు. స్కూలు, కాలేజీలకు వెళ్లి వచ్చేటప్పుడు అపరిచిత వ్యక్తులతో మాట్లాడకూడదన్నారు. ఎవరైనా మాయమాటలు చెప్పి కుటుంబ సభ్యులు రమ్మన్నారని, తనను పంపారని చెప్పినా నమ్మకూడదన్నారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో చాటింగులు చేయకూడదని, పరిచయాలు పెంచుకోకూడదన్నారు. సైబర్ నేరగాళ్లు మోసపూరితమైన లింకులను పంపిస్తారని, ఆ లింకులు ఓపెన్ చేయగానే బ్యాంక్ అకౌంట్లో ఉన్న సొమ్ములు కాజేస్తారని, ఫోన్లను హ్యాక్ చేస్తారని వివరించారు. గుడ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో పోలీసు సహాయం కోసం వెంటనే 112, కాని శక్తిటీమ్ సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 79934 85111కు కాల్ చేసి సాయం పొందవచ్చన్నారు. మహిళలపై వేధింపులు, ఆత్మరక్షణ పద్ధతులను వివరించారు. సైబర్ నేరానికి గురైతే 1930కు ఫిర్యాదు చేయాలని, బాల్య వివాహాలు నిరోధించడానికి 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. మహిళ బాలికల భద్రత కోసం జిల్లా పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని వారు వివరించారు.

## తాగునీటి సమస్య పరిష్కరించండి

ఆత్మకూరు

బుట్టాయగూడెం, జూలై 12(ఆంధ్రజ్యోతి): రెడ్డిగణపవరం పంచాయతీ వీరభద్రపురంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ శనివారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో దళితులు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మాజీ ఎంపీటీసీ అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ మూడ్రోజులుగా మంచి నీరందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. నేలపాల ఆటలమ్మ, సుజాత, సరోజిని, వీరమ్మ, వెంకట్, మారయ్య, రమణ, సీతయ్య, సుబ్బారావు పాల్గొన్నారు. బుట్టాయగూడెంలో నాగులమ్మ కాలువను చుట్టుపక్కల జనాలు చెత్తతో పూడ్చివేయడంతో నీరు నిలిచిపోయి దుర్గంధం, దోమల బెడద పెరిగిందన్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



ధర్నా చేస్తున్న వీరభద్రపురం గ్రామస్థులు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

## కోకో బోర్డు ఏర్పాటు చేయాలి

పెదవేగి, జూలై 12(ఆంధ్రజ్యోతి): కోకో బోర్డు ఏర్పాటుతోనే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని ఏపీ కోకో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. పెదవేగి మండలం వంగూరులో శనివారం నిర్వహించిన సమావేశంలో కోకో రైతుల సమస్యలపై చర్చించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో 75వేల ఎకరాల్లో కోకో సాగవుతుందని, మరో లక్ష ఎకరాల సాగుకు రైతులను ప్రోత్సహిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, కానీ కోకో బోర్డు లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. కోకో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు గుదిబండి వీరారెడ్డి, సహాయ కార్యదర్శి పానుగంటి అచ్యుతరామయ్య, రైతులు ఆలపాటి వాసు, పానుగంటి నరేష్, సుధాకర్, కొండపల్లి సత్యనారాయణ, గోపిశెట్టి శ్రీనివాస్, సింహాద్రి సతీశ్, ఏపూరి శ్రీనివాసరావు, కొట్టే సురేశ్, మామిళ్లపల్లి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

కొయ్యలగూడెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెం రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. శనివారం స్థానిక రోటరీ పంక్షన్ హాల్లో రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కల్యాణ చక్రవర్తి ప్రమాణస్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా మాదేటి సత్యనారాయణ, కార్యదర్శి కొనకళ్ల రామచంద్రరావు, ట్రెజరర్‌గా చిరువూరి శ్రీనివాసరావు, ప్రమాణ స్వీకారం చేశారు. అసిస్టెంట్ గవర్నర్ విశ్వనాథశర్మ, కొయ్యలగూడెం రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.





విద్యార్థులను సన్మానిస్తున్న స్పందన సంస్థ సభ్యులు

## టెన్త్ ఉత్తమ విద్యార్థినులకు సత్కారం

కొయ్యలగూడెం, జూలై 12(ఆంధ్రజ్యోతి): టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను స్పందన స్వచ్ఛందసేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. 10మందిని సత్కరించి నగదు బహుమతి అందజేశారు. ఆలిపెద్ది శేషయ్య శర్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఈ నగదు ప్రోత్సాహకాలను అందించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బలుసు నాగేశ్వరరావు, ప్రవీణ్‌కుమార్, జహంగీర్, హెచ్ఎం ఉమాదేవి పాల్గొన్నారు.

## విగ్రహానికే అనుమతిలేదు..

### - వాటర్ ఫౌంటేన్ ఎలా కడతారు?

ఏలూరు టూటౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): అనుమతిలేకుండా విగ్రహం ఏర్పాటు చేశారు. మళ్లీ ఆ విగ్రహం వద్ద వాటర్ ఫౌంటేన్ నిర్మించాలనడం ఎంతవరకు సబబని పలువురు ప్రశ్నిస్తున్నారు. నగరం నడిబొడ్డున ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో వైసీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం తమదే అడిగేదెవరని కనీసం విగ్రహ నిర్మాణానికి ప్రభుత్వ అనుమతి కూడా తీసుకోలేదు. మరలా ఇప్పుడు ఆ విగ్రహం చుట్టూ వాటర్ ఫౌంటేన్ నిర్మించాలని వైసీపీ నేతలు పేర్కొంటున్నారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అనుమతి లేకుండా కట్టిన విగ్రహాన్ని తొలగించలేదు. అయినప్పటికీ వైసీపీ నేతలు మరలా అక్కడ వాటర్ ఫౌంటేన్ నిర్మించాలని నానా యాగీ చేయడం ఎంత వరకు సబబని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నాలుగు రోడ్ల కూడలి ఎంతో రద్దీగా ఉండే ప్రాంతం. అక్కడ వాటర్ ఫౌంటేన్ నిర్మిస్తే వాహనాల రాకపోకలకు ఎంతో ఇబ్బందికరంగా ఉంటుంది. వాటర్ ఫౌంటేన్ నిర్మిస్తే ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయని ప్రజలు పేర్కొంటున్నారు.

**నా పరిధిలో లేదు :** వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేసిన స్థలంతో మున్సిపాల్టీకి సంబంధం లేదని నగర పాలకసంస్థ కమిషనర్ ఏ.భాను ప్రతాప్ పేర్కొన్నారు. అది ఆర్‌అండ్‌బీకి చెందిన స్థలం. నిర్మించిన వైఎస్సార్ విగ్రహానికి ప్రభుత్వ అనుమతిలేదని ఆయన పేర్కొన్నారు.



నాయకులకు దిశానిర్దేశం చేస్తున్న సోంబాబు

## ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించాలి

బుట్టాయగూడెం, జూలై 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను బూత్, యూనిట్ ఇన్‌చార్జీలు మరింత బాధ్యతగా తీసుకుని ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు వివరించాలని పార్టీ మండలాధ్యక్షుడు మొగపర్తి సోంబాబు అన్నారు. శనివారం బూసరాజుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి మండల సమావేశం నిర్వహించారు. బుట్టాయగూడెం మండలంలో ఇంటింటికీ తిరిగి పథకాలను ప్రజలకు వివరించారు. నాయకులు యంత్రప్రగడ శ్రీనివాసరావు, గద్దె అబ్బులు, ఆలపాటి ఫణికిషోర్, మడకం కన్నపరాజు, మొడియం సింగరాజు, మనెల్లి బాలు, ఎం.శ్రీను, కె.నాగేశ్వరావు, కె.మల్లేశ్వరరావు, జి.సూర్యచంద్రం, మొట్టుం కన్నయ్య, బి.ఎలీషా, వి.కృష్ణంరాజు పాల్గొన్నారు.



దళిత సంఘ నాయకులతో ఎమ్మెల్యే రోషన్

## ఎస్సీ కాలనీల్లో సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

లింగపాలెం, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కాలనీలో అభివృద్ధి పనులు మరింత ఎక్కువ చేయాలని లింగపాలెం మండల దళితనాయకులు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌ను కోరారు. శనివారం ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌ను చింతలపూడి నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు పల్లి శ్రీను, అనిలేటి అజయ్‌ల ఆధ్వర్యంలో పలువురు దళిత నాయకులు కలిశారు. దళితవాడల్లో సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దళితవాడలతో పాటు అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు దళిత నాయకులు తెలిపారు. తాడేపల్లి దాసుబాబు, కంభం రవి, బి.రవికుమార్, వి.సురేశ్, సి.హెచ్.సరయ్య, జి.కుటుంబరావు, పి.జేమ్స్, మధు, శౌరి, రాజారత్నం, రాజేశ్ పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేను కలిసిన డీఎంహెచ్‌వో

పెదవేగి, జూలై 12(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి(డీఎంహెచ్‌వో) డాక్టర్ జాన్ అమృతానికి సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జాన్ అమృతం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందేలా వైద్య సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకునేలా సూచనలు చేయాలన్నారు.

## పట్టణ అభివృద్ధికి వినతి

జంగారెడ్డిగూడెం, జూలై 12(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌ను పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్, టీడీపీ నాయకులు కోరారు.శనివారం చింతలపూడి ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి పలు సమస్యలు వివరించారు. జంగారెడ్డిగూడెం నుంచి తడికలపూడి వరకు ఉన్న ఏలూరు రోడ్డు అస్తవ్యస్తంగా ఉందని ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యేకు తెలియజేయగా ఆయన కలెక్టర్ వెట్రిసెల్వికి ఫోన్ చేసి ఏలూరు రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరినట్టు కిశోర్ తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకులు పరిమి సత్తిపండు, రాష్ట్ర క్షత్రియ, శెట్టిబలిజ కార్పొరేషన్ల డైరెక్టర్లు నంబూరి రామచంద్రరాజు, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, టీడీపీ నాయకుడు మహంకాళి రామ్మోహనరావు పాల్గొన్నారు.

## గ్రామ దేవతకు ఆషాఢ సారె

జీలుగుమిల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆషాడం సందర్భంగా మహిళా భక్తులు జీలుగుమిల్లిలో గ్రామ దేవతలకు సారె సమర్పించారు. జగదాంబ ఆలయం, ముత్యాలమ్మ, వాసవీ మాత, రామాలయం, షిర్డీసాయి, ఎల్లమ్మతల్లి, ఆంజనేయస్వామి ఆలయాల్ని దర్శించారు.

## 'అన్నదాత సుఖీభవ' రిజిస్ట్రేషన్‌కు నేడు తుది గడువు

ముసునూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం రిజిస్ట్రేషన్ ఆదివారంతో ముగియనున్నట్టు మండల వ్యవసాయ అధికారిణి చాముండేశ్వరి తెలిపారు. మండల వ్యాప్తంగా ఇప్పటివరకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలకు 8096మంది రైతులను అర్హులుగా గుర్తించామన్నారు. భూమి అన్‌లైన్‌లో పొందుపర్చి, ఆధార్ అనుసంధానమై అర్హుల జాబితాలో లేని రైతులు ఆదివారంలోగా గ్రామ రైతు సేవా కేంద్రాల్లో గ్రీవెన్స్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఏవో కోరారు.

## కల్లును కల్తీ చేస్తే చర్యలు

నూజివీడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కల్లులో ఎటువంటి మత్తు పదార్థాలు కలిపినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సీఐ ఎ. మస్తానయ్య హెచ్చరించారు. నూజివీడు ఎక్సైజ్ స్టేషన్‌లో కల్లు సొసైటీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. సొసైటీల్లో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం పలు సొసైటీల నుంచి కల్లు శాంపిల్స్‌ను కాకినాడ కెమికల్ ఆఫీస్‌కు పంపించారు.



కొత్తచెరువులో గట్టు వేసిన దృశ్యం

## ఆక్రమణల చెరలో కొత్తచెరువు

ముసునూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లబోయినపల్లిలోని కొత్తచెరువు ఆక్రమణకు గురైంది. చెరువులోకి నీరు చేరే సప్లయి ఛానల్‌తో పాటు రైతులు పంట పొలాలకు వెళ్ళేదారిని సైతం ఆక్రమణదారుడు గుట్టుచప్పుడు కాకుండా రాత్రికి రాత్రే తవ్వేశాడని ఆయకట్టు రైతులు కండేపు రంగరావు, చిలకలపూడి వెంకటేశ్వరావు, పామర్తి శ్రీనివాసరావు, మండలపు రాంబాబు తదితరులు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ చెరువు పూర్తి విస్తీర్ణం 9.80 ఎకరాలు ఉండగా, సమీప రైతు పరస నాగయ్య గత వైసీపీ ప్రభుత్వంలో సూమారు 1.50 ఎకరాల చెరువు భూమిని ఆక్రమించుకుని పండించుకుంటున్నాడని తెలిపారు. అయితే తన సొంత ఎక్స్‌కవేటర్‌తో శుక్రవారం రాత్రి మరో 50 సెంట్లు చెరువు భూమిని తవ్వి ఆక్రమించుకుని పెద్ద గట్టు వేశాడని, దీంతోపాటు చెరువులోకి నీరు వచ్చే సప్లయి ఛానల్‌ను తవ్వి పూడ్చివేయడంతోపాటు చెరువు ఆయకట్టులో ఉన్న సుమారు 60 ఎకరాల పొలాలకు వెళ్ళే దారిని తవ్వేశాడని రైతులు మండి పడుతున్నారు. ఈ ఆక్రమణల వల్ల చెరువు విస్తీర్ణం తగ్గి, చెరువులో నీరు నిల్వ ఉండే పరిస్థితులు సన్నగిల్లుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందన లేదని, జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

## బస్ స్టేషన్‌లో సౌకర్యాలు మెరుగు పరుస్తాం



బస్‌స్టేషన్‌లో టాయిలెట్స్ పరిశీలిస్తున్న జిల్లా ప్రజా రవాణా అధికారి షబ్నం

ముదినేపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి ఆర్టీసీ బస్ స్టేషన్‌లో ప్రయాణికులకు పూర్తి సౌకర్యాలు కల్పిస్తామని జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి ఎస్‌కె షబ్నం తెలిపారు. శనివారం ఆమె ఏలూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వాణి, పీఆర్వో నరసింహారావుతో కలసి ముదినేపల్లి బస్ స్టేషన్‌ను పరిశీలించారు. వి.రావిగుంట మాజీ సర్పంచ్ భూపతి రవీంద్ర, బస్ స్టేషన్ షాపుల లీజుదారు బందుల విజయ సాగర్‌తోపాటు పలువురు ప్రయాణికులు బస్ స్టేషన్‌లో టాయిలెట్స్ సమస్యలను పరిష్కరించాలని, సెప్టిక్ ట్యాంకులు పాడై దుర్వాసన వస్తున్నదని తదితర సమస్యలను ఆమెకు తెలిపారు. బస్ స్టేషన్ వద్ద జాతీయ రహదారుల అధికారులు చేపట్టిన డ్రైన్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసే విధంగా కూడ చర్యలు తీసుకుంటానని తెలిపారు. బస్ స్టేషన్ కంట్రోలర్ మద్దా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం



ముదినేపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పెదపాలపర్రు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ శనివారం ప్రమాణ స్వీకారం చేసింది. కమిటీ చైర్మన్‌గా బొప్పన లక్ష్మీ నరసింహారావు, సభ్యులుగా ఎ.కుసుమ కుమార్, పీవీఎన్ వరప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. త్రిసభ్య కమిటీని మండల టీడీపీ అధ్యక్షులు చల్లగుళ్ళ శోభనాద్రి చౌదరి సత్కరించారు. సంఘ ఆర్థికాభివృద్ధికి కమిటీ బాధ్యతాయుతంగా పని చేయాలని కోరారు. సర్పంచ్ గంటా రాకేష్ కుమార్, పీఐసీ వీవీ నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షులు ఎలిశెట్టి లక్ష్మయ్య, వల్లభనేని శివాజీ, సంఘ సీఈవో కె.నాగమల్లేశ్వరి, ఉప సర్పంచ్ గన్నమనేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 'సుపరిపాలన'లో నాయకులంతా పాల్గొనాలి

కైకలూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ గ్రామస్థాయి నాయకులంతా కచ్చితంగా పాల్గొనాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు అన్నారు. శనివారం కైకలూరులో ఆయన మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు గ్రామపార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, యూనిట్, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు గ్రామస్థాయిలో ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలన్నారు. ఆగస్టు 15వ తేది నుండి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ప్రారంభి స్తారన్నారు. ఈ పథకాలన పూర్తిగా ప్రజలకు అర్థమయ్యేలా గ్రామస్థాయి నాయకులు కృషి చేయాలన్నారు. రాష్ట్రపార్టీ ఆదేశాలను అనుసరించి ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సూచించారు.

## పెరుగుతూ.. శాంతిస్తూ

(5వ పేజీ తరువాయి)

ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే కొంతమంది భూదేవిపేట, బండ్లబోరు, దాచారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు తరలివెళ్లగా మిగిలిన వారిని తాడువాయి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు తర లించేందుకు చర్యలు చేట్టారు. తహసీల్దార్ కార్యాలయంలో వరదలను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎద్దువాగు వద్ద నీటమునిగిన లోలెవల్ కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని పరిశీలించారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఇతర అధికారులు, జనసేన మండల అధ్యక్షుడు గణేశుల ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు. పోలవరం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. పట్టిసీమ శివ క్షేత్రం చుట్టూ వరద జలాలు చుట్టుముట్టాయి. గోదావరి లంక భూము లు నీటమునిగాయి. గండి పోశమ్మ ఆలయం పూర్తిగా నీటమునిగింది.

## ఎన్నాళ్లీ కష్టాలు!


(5వ పేజీ తరువాయి)

కింద పూర్తిగా నష్టపరి హారం చెల్లించి పునరావాస కాలనీల్లో అన్ని సౌకర్యాలు కల్పించి ఉంటే ముంపు మండలాల వాసులకు ఈ కష్టా లు తప్పేవి. కానీ దీనికి భిన్నంగా వరుసగా నాలుగో ఏటా కూడా గోదావరి వరద తాకిడికి పెద్దసంఖ్యలో ప్రజలు ఇళ్లను ఖాళీచేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది.

**పొంచి ఉన్న ముప్పు**

గతేడాది భారీ వర్షాల తాకిడికి పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడింది. ఒకవైపు తెలంగాణ, మరోవైపు ఆంధ్రప్రదే శ్‌లు ఈ ప్రాజెక్టు నిర్వహణా వ్యయంలో ఖర్చును భరించాల్సి ఉంది. మరమ్మతు చేయాలన్న ఇదే దామాషా పద్ధతి. ఈ నేపథ్యంలో గతేడాది పెద్దవాగు ప్రాజెక్టుకు నష్టం వాటిల్లితే కేవలం నామమాత్రపు పనులతో సరిపెట్టారు. కానీ ఈసారి మరోసారి భారీ వర్షాలకు ఆస్కారం ఉంటే పెద్దవాగు ప్రాజెక్టు వద్ద చేసిన తాత్కాలిక పనులన్నీ దెబ్బతినే అవకాశం లేకపోలేదు. ఇదే భయంతో దిగువ గ్రామాల్లో ఉన్న స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వేసవిలోనే పెద్దవాగు ప్రాజెక్టుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాల్సిందీ పోయి కాలక్షేపం చేశారు. ఈ కారణంగా పెద్దవాగు ప్రాజెక్టు దిగువన వరద ముంపు పొంచే ఉంది.

### బ్రాయిలర్ ధరలు



| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 122, 131, 142 |
| చికెన్ విత్ స్కిన్ | 234 |
| చికెన్ స్కిన్‌లెస్ | 244 |

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



గిడ్డంగుల నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలం

# 25 ఏళ్లుగా ఎదురుచూపు

### కలగా మిగిలిన గిడ్డంగుల నిర్మాణం
### నష్టపోతున్న అన్నదాతలు

**చాట్రాయిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ గిడ్డంగుల నిర్మాణం కలగానే మిగిలిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫానులు, అధిక వర్షాలు వచ్చినప్పుడు పంటలను భద్రపర్చుకోవటానికి గిడ్డంగులు లేక రైతులు కష్టనష్టాలకు గురౌతున్నారు.**

చాట్రాయి, జూలై 12(ఆంధ్రజ్యోతి): సుమారు 25 ఏళ్ళ నుంచి ఇక్కడ వ్యవసాయ గిడ్డంగులు నిర్మించాలని రైతులు కోరుతుండగా ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. 2008లో తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా దేశిరెడ్డి రాఘవరెడ్డి ఉండగా చాట్రాయిలో గిడ్డంగుల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీని కోసం చాట్రాయి-నరసాపురం రహదారి పక్కన ఒక ఎకరం భూమి కూడా కేటాయించారు. కానీ ప్రభుత్వం నిధులు కేటాయించకపోవటంతో గిడ్డంగుల నిర్మాణం అటకెక్కింది. పంటలు నిల్వ చేసుకొని అవకాశం లేక రైతులు కల్లాల మీదే తక్కువ ధరలకు ప్రైవేటు వ్యాపారులకు తెగనమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో తగిన ధర రాక రైతులు నష్టపోతున్నారు. అదే వ్యవసాయ మార్కెట్ కమిటీ గిడ్డంగులు అందుబాటులో ఉంటే పంటలను వాటిలో నిల్వ చేసుకోవచ్చు, రైతుకు డబ్బు అవసరం అయితే పంట మీద రుణం తీసుకొని, మంచి ధర వచ్చినప్పుడు అమ్ముకునే సౌకర్యం ఉం టుంది. పంట హామీపై రైతులు రుణాలు కూడా తీసుకోవచ్చు. మంత్రి పార్థసారథి చాట్రాయిలో గిడ్డంగుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

### గిడ్డంగులు లేక నష్టపోతున్నాం



చాట్రాయిలో వ్యవసాయ మార్కె ట్ కమిటీ గిడ్డంగులు లేక నష్టపోతున్నాం. ఖరీఫ్, రబీ సీజన్లలో పం టలు కల్లాలపై ఉండగా అకాల వర్షా లు వచ్చి తరచూ కోలుకోలేని దెబ్బ తింటున్నాం. పంటలు నిల్వ చేసుకొనే అవకాశం లేక తక్కువ ధరలకు అమ్ముకోక తప్పటం లేదు. ప్రభుత్వ స్పందించి చాట్రాయిలో గిడ్డంగులు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

**- వెల్ది రాజారావు, రైతు, మర్లపాలెం.**



రోగి కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ అందజేస్తున్న మంత్రి పార్థసారథి

## రూ. 10 లక్షల ఎల్‌వోసీ అందజేసిన మంత్రి సారథి

చాట్రాయి, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు గ్రామానికి చెందిన బొంతు బ్రహ్మాజీరావు లివర్ సంబంధ వ్యాధితో హైదరాబాద్‌లో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. టీడీపీ నాయకుడు మంచిన పూర్ణచంద్రరావు, రోగి కుటుంబ సభ్యులను తీసుకొని నూజివీడు ఎమ్మెల్యే, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథిని కలిసి మెరుగైన వైద్యానికి సాయం అందించాలని కోరగా, వెంటనే స్పందించిన మంత్రి సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ. 10 లక్షల ఎల్‌వోసీని శనివారం బ్రహ్మాజీరావు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపద సమయంలో తమను ఆదుకున్న మంత్రి సారథికి బ్రహ్మాజీరావు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



తమ్మిలేరు ప్రాజెక్టు కుడి కాలువలో తూడు తొలగిస్తున్న కూలీలు

## సొంత నిధులతో తూడు తొలగింపు

చాట్రాయి, జూలై 12(ఆంధ్రజ్యోతి): తమ్మిలేరు ప్రాజెక్టు కుడి కాలువలో తూడు దట్టంగా పెరిగి నీటి ప్రవాహానికి అడ్డుపడి ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతుండడంతో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మరిడి వెంకటేశ్వరరావు(చిట్టిబాబు) తన సొంత నిధులు రూ. 55 వేలతో కూలీలను ఏర్పాటు చేసి ఒక కిలో మీటరు దూరం తూడు తొలగించారు. తూడు తొలగింపు తరువాత ఆయకట్టుకు నీటి ప్రవాహం పెరగటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ్మిలేరు ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడు యర్రా రమేష్, టీడీపీ నాయకులు యర్రా ప్రసాద్, బిలుగుది జయరాజు పనులను పర్యవేక్షించారు.

## స్వచ్ఛందంగా..



వింజరం సాలిపేటలో అభివృద్ధి చేసుకున్న రహదారిని చూపుతున్న గ్రామస్థులు

### విరాళాలు సేకరించి రహదారి పనులు

కైకలూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): గ్రామస్థులు స్వచ్ఛందంగా రహదారికి ఇరువైపులా చెట్లను తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేసుకున్నారు. శనివారం వింజరం శివారు సాలిపేటకు వెళ్లేదారి కిరువైపులా కాలువగట్లు వెంబడి చెట్లను తొలగించి గోతులను స్వచ్ఛందంగా పూడ్చుకున్నారు. గ్రామస్థుల సహకారంతో రూ.30 వేలు విరాళాలు సేకరించి పనులు చేపట్టారు. పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ ఎవరూ స్పందించకపోవడంతో వారే స్వచ్ఛందంగా పనులు చేపట్టారు. రహదారిపై మరిన్ని గోతులు న్నాయని వాటిని కూడా మరో రెండు రోజుల్లో పూడ్చి వేస్తామని గ్రామస్థులు స్పష్టం చేశారు.



కైకలూరులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ మాల్యాద్రి

# రాష్ట్రాభివృద్ధే కూటమి ధ్యేయం

### ఇంటింటికీ టీడీపీలో ఆ పార్టీ నాయకులు

కైకలూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి పాలన సాగుతోందని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజేఎస్ మాల్యాద్రి అన్నారు. శనివారం కైకలూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కైకలూరులోని 119వ బూత్‌లో ఇంటింటికి తిరుగుతూ సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఎస్సీ సెల్ నాయకుడు వీరాబత్తిన సుధా, టీడీపీ నాయకులు అద్దేపల్లి బ్రహ్మజీ, కొల్లిపాకల కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఆచవరంలో 168, 169 బూత్‌లలో నాయకులు ఇంటింటికి వెళ్లి పథకాలను వివరించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. టీడీపీ మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పి. రాధాకృష్ణ, యూనిట్ ఇన్‌చార్జి నాగనబోయిన నాంచారయ్య పాల్గొన్నారు.

**కలిదిండి:** సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎంపీపీ, టీడీపీ సీనియర్ నాయకుడు వలవల వెంకట రామారావు అన్నారు. శనివారం కోరుకొల్లులో టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నున్న సుబ్రహ్మణ్యం, గ్రామ టీడీపీ అధ్యక్షులు చెన్నంశెట్టి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి నల్లిబోయిన భోగేశ్వరరావు, నాయకులు ఆమజాల బాబులు, బొమ్మిడి సింహాచలం, సీహెచ్.శ్రీనివాసరావు, ఎం.రాజేష్ పాల్గొన్నారు.

**ముదినేపల్లి:** ముదినేపల్లి మండలం అల్లూరు, ఈడేపల్లి గ్రామాల్లో శనివారం టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు యువత కైకలూరు నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేసి కూటమి ప్రభుత్వం వాగ్దానాలను అమలు చేస్తున్న తీరును వివరించారు. పార్టీ నాయకులు బండారు శ్రీరంగరాజు, దూసనపూడి రాంబాబు, బండారు వెంకట అప్పయ్య, పంతగాని నాగ శ్రీనివాస్, దాసరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**చాట్రాయి:** జనరంజక పాలనే కూటమి ధ్యేయమని మండల టీడీపీ నాయకుడు నక్కా రాము అన్నారు. సూరంపాలెంలో శనివారం టీడీపీ నాయకులు ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు పంచి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరించారు. సూపర్ సిక్స్ హామీలు ఒక్కొక్కటి అమలు చేస్తున్నారని, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నారని వివరించారు. టీడీపీ నాయకులు దార్ల సురేష్‌కుమార్, కందుల శివన్నారాయణ, మునగంటి శ్రీనివాసరావు, కందుల సుబ్బారావు, శివ, బూబత్తుల రాంబాబు పాల్గొన్నారు.

**ముసునూరు:** గత ఐదేళ్ళ వైసీపీ విధ్వంస పాలన నుంచి బయటపడి కూటమి ప్రభుత్వ పాలనలో సుపరిపాలన వైపు రాష్ట్రం అడుగులు వేస్తోందని సర్పంచ్ తల్లిబోయిన రాధిక సత్యనారాయణ, టీడీపీ గ్రామ అధ్యక్షులు కాటేపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం చెక్కపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడాది పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని వివరిస్తూ, కరపత్రాలను అందజేసి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల తెలుగుయువత అధ్యక్షులు కాటేపల్లి గిరిబాబు, నాయకులు మామిడిశెట్టి గిరి బాబు, కాటేపల్లి ప్రసాద్, యూనిట్ ఇన్‌చార్జ్ కొండపర్వ త్రిమూర్తులు పాల్గొన్నారు.





సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో చెక్కపల్లి, కోరుకొల్లు, ఈడేపల్లిలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

# వ్యాన్ ఢీకొని ఒకరి మృతి

### న్యాయం చేయాలంటూ మృతుడి కుటుంబీకులు, గ్రామస్థుల ధర్నా.. ట్రాఫిక్ జామ్



మృతుడు గంగరాజు (ఫైల్)



మృతుడి కుటుంబీకులు, గ్రామస్థుల ధర్నా

ఆగిరిపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నెక్కలం అడ్డురోడ్డు వద్ద శుక్రవారం కోడి గుడ్ల వ్యాను ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందగా బాధిత కుటుంబీకులు న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించారు. వారికి బాసటగా గ్రామస్థులు ధర్నా చేసిన ఘటన శనివారం నెక్కలం గొల్లగూడెంలో చోటుచేసుకుంది. నెక్కలం గొల్లగూడేనికి చెందిన పటాపంచల గంగరాజు (35) శుక్రవారం ద్విచక్ర వాహనంపై ఆగిరిపల్లి వస్తుండగా, ఎన్టీఆర్ జిల్లా నున్న నుంచి కోడిగుడ్ల కోసం ఆగిరిపల్లి వస్తున్న వ్యాన్ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగరాజు తీవ్ర గాయాలపాలు కాగా, చికిత్స కోసం విజయవాడ తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాగా శనివారం మధ్యాహ్నం మృతుడి కుటుంబీకులు, గ్రామస్థులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ వారికి సరైన న్యాయం జరగకపోవడంతో నెక్కలం గొల్లగూడెంలో మధ్యాహ్నం రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ, నూజివీడు టౌన్ సీఐ, ముసునూరు, నూజివీడు టౌన్, నూజివీడు రూరల్ ఎస్‌ఐ ధర్నా ప్రాంతానికి చేరుకున్నారు. గ్రామ పెద్దలు, నూజివీడు డీఎస్పీ వద్ద చర్చలు జరపడంతో ప్రమాదానికి కారణమైన వాహన యజమానులతో చర్చించి, ఎట్టకేలకు ఈ సమస్యను డీఎస్పీ పరిష్కరించారు. గ్రామ పెద్దలు చెప్పడంతో ధర్నా విరమించారు. సుమారు మూడున్నర గంటలకు పైగా ధర్నా నిర్వహించడంతో రోడ్డుకు ఇరువైపులా నాలుగు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

## లంక గ్రామాలకు తాగు, సాగునీరు విడుదల చేయాలి

కలిదిండి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): లంక గ్రామాలకు సమృద్ధిగా సాగు, తాగునీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. గుర్వాయిపాలెం - పెదలంక కాల్వకు ఇంత వరకు నీరు తగినంత సరఫరా కాక ఇబ్బందులు పడుతున్నారు. చేపల చెరువులకు కొంతకాలంగా తీపి నీరు లేకపోవటంతో చెరువుల్లో నీటి మట్టం తగ్గి ఎండ వేడికి చేపలు చనిపోతున్నాయని వాపోతున్నారు. ఉప్పుటేరులో ఉప్పు నీరు ఉండటంతో కొండంగి ఎత్తిపోతల పథకం మూత పడిందని, దీంతో సాగునీటి కొరత ఏర్పడి తెల్ల చేపల చెరువులు అడుగంటాయి. తాగునీటి చెరువుల్లో నీటి మట్టాలు తగ్గాయి. కోరుకొల్లు లాకుల వద్ద సీబీ కెనాల్‌కు సాగు, తాగునీరు విడుదల చేసి 22 రోజులు గడుస్తున్నప్పటికీ లంక గ్రామాలకు ఇంత వరకు అరకొరగానే నీటి సరఫరా చేస్తుండటంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

## శాకంబరిగా గంగానమ్మ



ముదినేపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పెదపాలపర్రులో గంగానమ్మ వారికి శనివారం శాకంబరీ అలంకరణ చేసి భక్తులు విశేష పూజలు చేశారు. గ్రామస్థులు అందజేసిన కూరగాయలను అమ్మవారికి అలంకరించి అర్చకుడు నరసింహారావు పూజలు జరిపారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. అనంతరం పెదపాలపర్రు శ్రీ సత్యసాయి భజన మండలి సభ్యులు భజన కార్యక్రమాన్ని నిర్వహించారు.



విగతజీవులుగా పడి ఉన్న మేకలు

## అంతుచిక్కని వ్యాధితో మేకల మృత్యువాత!

### 3 రోజుల్లో 9 మేకలు మృతి

ఆగిరిపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అంతుచిక్కని వ్యాధి సోకి మేకలు మృతి చెందడంతో ఆగిరిపల్లి మండలం వడ్లమాను గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. కేవలం 3 రోజుల వ్యవధిలో ఒకే రైతుకు చెందిన తొమ్మిది మేకలు మృతి చెందాయి. సాదం స్వామి సుమారు 30 మేకలతో జీవనం సాగిస్తుండగా, గురువారం ఒక మేక, శుక్రవారం 4, శనివారం మరో 4 మృతి చెందాయి. శుక్రవారం స్థానిక పశు వైద్య సిబ్బందికి తెలియపరచడంతో వారు వచ్చి చూసినప్పటికీ వ్యాధి అర్థం కాలేదని బాధితుడు వాపోయాడు. శనివారం మరికొన్ని మేకలు చనిపోవడంతో ఎంపీటీసీ ఆర్. సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ వంశీకృష్ణకు తెలపగా వారు పశువైద్యాధికారికి సమాచారం ఇచ్చారు. పశువైద్యాధికారి హనుమంతరావు సిబ్బందితో వచ్చి మేకలకు చికిత్స నిర్వహించారు. మృతి చెందిన మేకల విషయంపై నివేదికను ఉన్నతాధికారులకు తెలియపరుస్తానని అన్నారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు స్వామి, గ్రామస్థులు కోరుతున్నారు.

## ఆగస్టు 15లోపు పంటల బీమా ప్రీమియం చెల్లించండి

నూజివీడు టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకంలో చేరేందుకు ఆగస్టు 15 లోపు రైతులు తమ ప్రీమియం చెల్లించాలని నూజివీడు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు చాముండేశ్వరి అన్నారు. ఆగస్టు 15 లోపు వరి, పత్తి, నిమ్మ రైతులు ప్రీమియం చెల్లించాలన్నారు. మినుము రైతులు జూలై 31లోపు చెల్లించాలని తెలిపారు.

## దత్తాశ్రమంలో కోటి దత్తహోమం

మండవల్లి జూలై 12(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం లోకుముడి గ్రామంలోని శ్రీదత్తాశ్రమంలో ప్రపంచ శాంతి కోసం గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆదేశాల మేరకు కోటి దత్తహోమం నిర్వహణకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా దత్తాశ్రమంలో శనివారం కోటి దత్తహోమం ప్రారంభించినట్లు ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఉదయశంకర్ తెలిపారు. వేద పండితుల మంత్రోచ్చరణ మధ్య దత్తహోమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు.



## విద్యార్థులకు క్రికెట్ కిట్ల పంపిణీ

ముదినేపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి జడ్పీ హైస్కూలు విద్యార్థులకు ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్ క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. మెగా పీటీఎం సందర్భంగా హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పలువురు విద్యార్థులు క్రికెట్ కిట్లు కోరవటంతో వాటిని శనివారం ఆయన అందజేశారు. క్రీడలను ప్రోత్సహించేందుకు తనవంతు సహకారం అందిస్తానని వినోద్ తెలిపారు.

## క్రైమ్ కార్నర్

### మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

కలిదిండి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కలిదిండి మండలం మూల్లంక గ్రామానికి చెందిన మామిడిశెట్టి రాము (45) చేపల చెరువుపై కాపలా ఉంటున్నాడు. భార్య కువైట్‌లో ఉంటోంది. కుటుంబ సమస్యలతో కొంతకాలంగా రాము మద్యానికి బానిసయ్యాడు. రోజురోజుకు సమస్యలు తీవ్రమవటంతో మనస్థాపానికి గురై శుక్రవారం రాత్రి చేపల చెరువు వద్ద విషపూరిత గ్యాస్ బిళ్లలను నీటిలో కలుపుకుని తాగేశాడు. కుటుంబీకులు హుటాహుటిన కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఏఎస్‌ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బాలిక ఆత్మహత్యాయత్నం

నూజివీడు టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పోతురెడ్డిపల్లిలో బాలికకు వివాహం చేసేందుకు యత్నించడంతో మనస్థాపానికి గురైన ఆమె నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సమీపంలోని వారు గుర్తించి బాలికను నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బాలికను విజయవాడ తరలించారు. పెళ్ళి వద్దు తాను చదువుకుంటానని బాలిక చెప్పినా తల్లి వినకపోవడంతోనే ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించినట్లు బాలిక సమీప బంధువులు పేర్కొన్నారు. సమాచారాన్ని అంగన్‌వాడీ అధికారుల దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్ళారు. దీనిపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా సీడీపీవో అందుబాటులోకి రాలేదు.

### కర్రలతో దాడి.. ఒకరికి తీవ్ర గాయాలు

ముదినేపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పెద గొన్నూరులో పొలం సరిహద్దు విషయమై ఏర్పడిన వివాదం కొట్లాటకు దారితీయగా బీవీ రామారావు అనే వ్యక్తి తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఈ నెల 6న రామారావు పొలం వద్ద పశువులను మేపుతుండగా అక్కడికి వచ్చిన ఎస్. రామకృష్ణ, సతీష్ అనే యువకులు పొలం సరిహద్దు విషయమై గొడవ పడ్డారు. గొడవ పెద్దది కాగా ఇద్దరు యువకులు రామారావును కర్రలతో దాడి చేశారు. గాయపడిన అతనిని గుడివాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా శనివారం ఆస్పత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి ఎస్‌ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.